సాక్షి 24|7

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు సోమవారం 28-8-2017



నవరత్నాలు ఆణిముత్యాలు

నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ మేకపాటి పక్కన ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు

7 లో




కావలిలో మూతపడిన సుజలం పథకం ప్లాంట్

గ్రామీణ ప్రాంత వాసులకు శుద్ధిజలం అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంత వరకు నెరవేరలేదు. దీంతో జిల్లాలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం తీరు మూడేళ్లగా ప్రశ్నార్థకంగా మారింది. టీడీపీవి ప్రచార ఆర్భాటాలే తప్ప ఆచరణలో నీటి మూటలే అనేందుకు ఈ పథకం అమలే నిదర్శనం.

సుజలం.. విఫలం

మూడేళ్లుగా ఏర్పాటు కాని శుద్ధిజల యంత్రాల పథకం



నెల్లూరు(సెంట్రల్):

సుజల స్రవంతి పథకం కింద జిల్లాలో 692 ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 78 ప్లాంట్లను మాత్రమే ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రాంతాలలో త్వరలోనే ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని పలు చోట్ల కలుషిత నీటితో ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. పలుచోట్ల ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి నెలకొందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తోంది. చాలా చోట్ల పేదలు కాయకష్టం చేసి ఉన్న డబ్బులు వైద్యశాలలకు ఖర్చుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంపై ఆశలు పెట్టుకున్న వారికి మూడేళ్లుగా నిరాశే ఎదురవుతోంది. 20 లీటర్ల మినరల్ వాటర్ రూ.2కే ఇస్తామని 2014 అక్టోబరు 2వ తేదీన టీడీపీ ప్రభుత్వం ఆర్భాటంగా పథకాన్ని ప్రారంభించింది. మూడేళ్లు కావస్తున్నా ఇంత వరకు పూర్తిగా పథకం అమలుకాక పోవడంతో సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ గ్రామాల పరిస్థితి ఏమిటి?

సుజల స్రవంతి పథకం కింద తొలుత 692 గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీటిలో ఫ్లోరైడ్ ప్రాంతాలుగా ఉన్న 131 గ్రామాలను అప్పట్లో గుర్తించారు. మిగిలిన 561 గ్రామాలు

- మిగతా 2లో..



సీతారామపురం మండలంలో జేసీబీతో చేస్తున్న ఉపాధి పనులు

నేతలకు ఉపాధి

2 లో

జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో అధికార పార్టీ నేతలు, అధికారులు కుమ్మక్కై రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఈ పనుల్లో జరిగిన అవినీతిని సామాజిక తనిఖీ బృందాలు బట్టబయలు చేస్తున్నాయి. అవినీతి బయటకు రాకుండా ఉండేందుకు డ్వామా అధికారులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. నామమాత్రంగా రికవరీలకు ఆదేశాలు జారీ చేస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు.

బైబై గణేశా..



8 లో

వాకాడు: తూపిలిపాళెం బీచ్‌లో గణనాథుని నిమజ్జనం చేస్తున్న భక్తులు

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులు పూజలందుకున్న గణనాథులను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. నెల్లూరు పెన్నానది, మైపాడు, కోడూరు, తూపిలిపాళెం బీచ్‌లలో విఘ్ననాథులను నిమజ్జనం చేశారు. భక్తుల కోలాహలం నెలకొంది.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి



చంద్రబాబు బెదిరింపులకు భయపడేది లేదు

7 లో

మెరుగైన వైద్య సేవలందించాలి

■ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ అరుణకుమారి



కిసాన్‌నగర్ ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అరుణకుమారి

నెల్లూరు(బారకాసు): పట్టణాల్లోని శివారు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ అరుణకుమారి ఆదేశించారు. ఆదివారం నెల్లూరు వచ్చిన ఆమె నగరంలోని పడారుపల్లి, కిసాన్‌నగర్, ఎన్టీఆర్ నగర్‌లోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల నిర్వాహణను అపోలో సం స్థకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. అందుకు ఆ సంస్థకు పుష్కలంగా నిధులు విడుదల చేస్తోందని చెప్పారు. ఇక్కడి ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయా కేంద్రాల వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే అవసరమైన వారికి కచ్చితంగా ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. వర్షాకాలం కారణంగా అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరికీ మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే మందులు కూడా పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందించే వైద్యసేవలన్నింటినీ పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసి సంబంధిత అధికారులకు నివేదించాలన్నారు. ఈమె వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ వరసుందరం ఉన్నారు.

సోమశిలకు తగ్గిన వరద



సోమశిల జలాశయంలో జలకళ

సోమశిల: సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఆదివారం తగ్గు ముఖం పట్టింది. పైతట్టు ప్రాంతాల నుంచి ఉదయం జలాశయానికి 23,600 క్యూసెక్కుల వంతున వస్తున్న వరద సాయంత్రానికి 7,600 క్యూసెక్కులకు తగ్గు ముఖం పట్టింది. ప్రస్తుతం జలాశయంలో 9.408 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 550 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 83.405 మీటర్ల నీటి మట్టం నమోదైంది. జలాశయానికి మరికొద్ది రోజులు వరద ప్రవాహం కొనసాగవచ్చునని అధికారుల భావిస్తున్నారు.

నేతలకు ఉపాధి

■ రూ.కోట్లు కొల్లకొడుతున్న అధికార పార్టీ నాయకులు
■ సహకరిస్తున్న అధికారులు
■ సోషల్ ఆడిట్‌లో వెలుగుచూస్తున్న నిజాలు
■ రికవరీ ఊసే లేదు

ఉదయగిరి :

జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో అవినీతికి పాల్పడిన అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేస్తున్నా తిరిగి రాజకీయ నేతల సిఫార్సులతో తక్కువ వ్యవధిలోనే విధుల్లో చేర్చుకుంటుండటంతో పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండటంలేదు.

యంత్రాలతో చేయించి..

జిల్లాలోని 42 మండలాల్లో ఉపాధి హామీ పథకం అమలులో ఉంది. కొన్ని మండలాల్లో కూలీల చేత చేయించాల్సిన పనులను యంత్రాలతో చేయించడం, బినామీ మస్టర్లు వేయటం, పనులు చేయకుండానే రికార్డుల్లో చేసినట్లుగా నమోదుచేస్తున్నారు. ఊటకుంటలు, చెక్ డ్యాంలు, ఇతర సామగ్రి పనుల్లో భారీ ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారు. మూడేళ్లనుంచి ఈ పనుల్లో అవినీతి స్థాయి భారీగా పెరిగింది.

- దుత్తలూరు మండలంలో గతేడాదిలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో అంతులేని అవినీతి చోటుచేసుకుంది. ఇక్కడ రూ.10.57 కోట్లతో పనులు జరగ్గా, అందులో రూ.5.94 కోట్లు అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనికి బాధ్యులైన సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఎంపీడీఓను కూడా విధుల నుంచి తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించిన పలువురు సిబ్బందిపై, సప్లయ్‌దారులపై ఆర్‌ఆర్ యాక్ట్‌కింద కేసులు చేసి రికవరీకి ఆదేశించారు. కానీ రాజకీయ జోక్యంతో ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదు. రికవరీలు చెల్లించలేదు. దీనివెనుక అధికార పార్టీ పెద్దల హస్తం ఉందనే విషయం స్పష్టం.
- బాలాయపల్లి మండలంలో గతేడాది జరిగిన రూ.11.63 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి గత జూన్‌లో సామాజిక తనిఖీ నిర్వహించగా రూ.3 కోట్లు అవినీతి జరిగినట్లు తేలింది. ఇందులో డ్వామా అధికారులు రూ.25 లక్షలు రికవరీ పెట్టారు. కానీ ఇంతవరకు రికవరీ చెల్లించలేదు.
- ఈనెల 19వ తేదీన సీతారామపురం మండలంలో జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.9.84 కోట్లు అవినీతి జరిగినట్లు గుర్తించారు. డ్వామా అధికారులు ఈ అవినీతిని కప్పెట్టి రూ.87 లక్షలు వివిధ వర్గాలనుంచి రికవరీకి ఆదేశించారు. దీనికి బాధ్యులైన వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

రికవరీ ఎప్పుడో..?

ఉపాధిహామీ పనులు జరిగిన ఈ పదేళ్లలో ఎనిమిది సార్లు సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి జరిగిన పనులను చూశారు. వీరి తనిఖీల్లో రూ.కోట్లు అవినీతి జరిగినట్లుగా గుర్తించి నివేదికలు ఇచ్చినప్పటికీ డ్వామా అధికారులు బహిరంగ చర్చావేదికల్లో తగ్గించి చూపిస్తున్నారు. ఈ పథకం జిల్లాలో ప్రారంభమైన నాటినుంచి నేటివరకు రూ.6.25 కోట్లు రికవరీకి ఆదేశాలిచ్చారు. కానీ ఇంత వరకు అందులో సగం కూడా వసూలుకాలేదు. పైగా రాజకీయ నాయకుల సిఫార్సులతో పలువురు సిబ్బంది, సప్లయ్‌దారులు తమపై విధించిన రికవరీలను భారీగా తగ్గించుకుంటున్నారు.

రికవరీలు కట్టిస్తున్నాం

ఉపాధిహామీలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. నిధులు రికవరీ పెడుతున్నాం. ఇప్పటికే కొంత మొత్తంలో రికవరీ కట్టించాం.ఉపాధి సిబ్బందికి సంబంధించి జీతాల్లో కట్‌చేసి రికవరీకి జమ చేస్తున్నాం. తప్పుచేసిన వారిపై చర్యలు తప్పవు. - **హరిత, డ్వామా పీడీ**

సుజలం.. విఫలం

▶ మొదటి పేజీ తరువాయి

ఉప్పు శాతం ఎక్కువగా ఉన్న ప్రాంతాలుగా ఎంపిక చేశారు. అప్పట్లో ఆర్భాటం చేసిన అధికార పార్టీ నాయకులు ఆ తరువాత నిమ్మకుండిపోయారు. మొత్తం 692 గ్రామాలకు ఇప్పటి వరకు 78 ప్లాంట్లు మాత్రమే చేశారు. ప్రధానంగా ఉదయగిరి, దుత్తలూరు, సీతారామపురం, వరికుంటపాడు మండలాల్లోని 131 గ్రామాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంతవరకు పూర్తిగా అమలుకు నోచుకోలేదు.

ముందుకు రాని దాతలు

దాతల సహకారంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పేరుతో నీటి సమస్య ఉన్న ప్రాంతాలలో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాతలు ముందుకు రాక పోయినా ప్రభుత్వం ఏర్పాటు చేసేవిధంగా అప్పట్లో ప్రణాళిక సిద్ధం చేసింది. అనుకున్న స్థాయిలో దాతలు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీని పూర్తిగా నిలబెట్టుకోలేక మమ అన్నట్లుగా నత్తనడకన సాగిస్తూ వస్తోంది.



నూతన విధానంతో ఆలస్యం


ప్రభుత్వం ఆర్వో ప్లాంట్ల విషయంలో కొత్త విధానాన్ని అంటే క్లస్టర్ బేస్డ్ ఆర్ఓ ప్లాంట్ సిస్టం ఏర్పాటు చేస్తామని చెప్పింది. అందుకోసం మొత్తం ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించింది. వాటికి సంబంధించి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపి ఉన్నాం. ఉత్తర్వులు రాగానే ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం.
–**కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్‌ఈ**

జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నాం

■ గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్

గూడూరు: జిల్లాలోని గ్రంథాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు జీతాలు రాక పలు ఇబ్బందులు పడుతున్నారని ఆ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీ నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది జూలై నెల జీతాలు రాక కొందరు తొలి పండగ అయిన వినాయక చవితిని కూడా చేసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కిలారి వెంకటస్వామి నాయుడు జీతాల గ్రాంట్ రాకపోయినా, గ్రంథాలయాల సెస్సు నుంచి ఉద్యోగులకు జీతాలు ఇవ్వమని ఆదేశించారని తెలిపారు. ఆ ఖాతా ఫ్రీజింగ్‌లో ఉన్న కారణంగా ఆ విధంగా కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అలాగే పెన్షనర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సంస్థ ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి



జనారణ్యంలోకి వచ్చిన చుక్కల దుప్పి

సంగం(ఆత్మకూరు):

సంగం కొండపై ఉన్న చుక్కల దుప్పిపై ఆదివారం కుక్కలు దాడి చేయడంతో పరుగులు దీస్తూ రాళ్లచెలికలోని నీలం వెంకటేశ్వర్లు అనే చేనేత కార్మికుని ఇంట్లోకి చేరింది. దీంతో చేనేత కార్మికుడు స్థానిక యువకులతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న సంగం పోలీసులు ఫారెస్ట్‌గార్డు బాబుకు సమాచారాన్ని ఇచ్చారు. గార్డు బాబు సంగం వచ్చి చుక్కల దుప్పిని కలిగిరి రహదారిలోని తిప్పపైకి తీసుకెళ్లి విడిచిపెట్టారు.

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి


వాకాడు: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వెంకయ్య


తడ: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన శ్రీనివాసులు


తడ: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకృష్ణ


తడ: విద్యుత్ షాక్‌తో గాయపడిన వినోద్


తడ: విద్యుత్ షాక్‌తో గాయపడిన జయకృష్ణ

- వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

అండగుండాల(తడ): గణేశ నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. ట్రాక్టర్‌పై నిమజ్జనానికి గణనాథుడి విగ్రహాన్ని తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు ప్రాణా లు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని అండగుండాలలో ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్య క్ష సాక్షుల కథనం మేరకు.. అండగుండాలలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఆది వారం యువకులు ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో 11 కేవీ విద్యుత్ తీగలు విగ్రహానికి తగలడంతో ట్రాక్టర్‌పై ఉన్న యువకుల్లో నలు గురు విద్యుదాఘాతానికి గురయ్యారు. పిచ్చుక యువకృష్ణ(22), పిచ్చుక శ్రీని వాసులు(24), గుత్తి వినోద్, పీ జయకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారు అప్రమత్తమై గాయపడిన వారిని వెంటనే సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు యువకృష్ణ, శ్రీని వాసులు చనిపోయినట్లుగా నిర్ధారించా రు. దీంతో మృతదేహాలను గ్రామానికి తీసుకెళ్లారు. మిగి లిన ఇద్దరికి ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైకు తరలించారు. కాగా విషయం తెలుసుకున్న తడ ఎస్సై డీ వెకంటేశ్వరరావు గ్రామానికి చేరుకుని వివరాలను తెలుసుకున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాలని, సూళ్లూరుపేట ఆస్పత్రికి తీసుకురావాలని బంధువులకు సూచించారు. రాత్రికి ఇంటి వద్దే ఉంచి ఉదయం తీసుకువస్తామని చెప్పగా ఉన్నతాధికారుల అనుమతితో మృతదేహాలను గ్రామంలోనే ఉంచారు. సూళ్లూరుపేట సీఐ ఎన్ కిషోర్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అండగుండాలలో విషాద ఛాయలు

గణేశ ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుని ఇద్దరు యువకులు విగత జీవులుగా మారడం.. మరో ఇద్దరు ప్రమాదకర పరిస్థితుల్లో ఉండటంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ప్రమాదంలో చనిపోయిన శ్రీనివాసులు చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. చేతికంది వచ్చిన పెద్ద కొడుకు తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మరో మృతుడు యువకృష్ణ ఒక్కగానొక్క బిడ్డ కావడంతో తల్లిదండ్రులు అల్లారు ముద్దుగా పెంచారు. ఇటీవలే బీటెక్ పూర్తి చేసుకున్న కుమారుడ్ని కరెంటు బలి తీసుకోవడంతో కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

సిద్దిగుంటపాళెంలో మరో యువకుడు మృతి

వాకాడు: మండలంలోని సిద్దిగుంటపాళెంలో వినాయకుడి మండపం వద్ద శని వా రం రాత్రి విద్యుత్ షాక్‌నకు గురై ఓ యు వకుడు మృతి చెందాడు. వివరాలు..గ్రామానికి చెందిన తేనేటి రమణయ్య, ఆదిలక్ష్మమ్మ దంపతుల కుమారుడు తేనేటి వెంకయ్య(18) శనివారం రాత్రి చవితి సంబరాల్లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అలంకరణ విద్యుత్ బల్బుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి కుప్ప కూలాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లుగా వైద్యులు తెలి పారు. వెంకయ్యకు విద్యుత్ తీగ తగిలిన సమయంలో జోరు వాన కావడంతో మరిం త ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. వెంకయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పరామర్శించారు.

గుండెపోటుతో రైల్లో ప్రయాణికుడి మృతి


మృతిచెందిన రాజారామ్

నెల్లూరు సిటీ: గుండెపోటుతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి రైల్లో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు..ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జయపూర్‌కు చెందిన రాజారామ్(41) పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బెంగళూరులో పెయింట్ పనులు చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. ఈ క్రమంలో ఆదివారం రైలు కావలి స్టేషన్ దాటిన తరువాత గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు రైల్వే సిబ్బంది ద్వారా నెల్లూరు ప్రధాన స్టేషన్‌కు సమాచారం అందజేశారు. రైలు నెల్లూరుకు చేరుకోగానే రైల్వే పోలీసులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. దీంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిద్దెపై నుంచి జారిపడి మహిళకు తీవ్రగాయాలు


గాయపడిన వెంకటరమణమ్మ

నాయుడుపేటటౌన్: మిద్దెపై నుంచి జారిపడి మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది.వివరాలు.. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పీ వెంకటరమణమ్మ మిద్దెపై దుస్తులు ఆరపెట్టేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

చెరువులో పడిపోయి విద్యార్థి దుర్మరణం



దొరవారిసత్రం: వినాయక చవితికి ఇంటికి వచ్చిన ఇంటర్ విద్యార్థి చెరువులోని గ్రావెల్ గుంత జారిపడి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన పోలిరెడ్డిపాళెం పంచాయతీ పరిధిలోని గొల్లపాళెంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు... గొలపాళేనికి చెందిన సనుకూరు రవి, రమణమ్మ దంపతుల రెండో సంతానం సాయి(17) నెల్లూరులోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం వినాయక చవితి సందర్భంగా ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులతో కలిసి ఎంతో సంతోషంగా పండగ జరుపుకొన్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి వినాయకుడి విగ్రహం ఊరేగింపులో పాల్గొన్నాడు. అనంతరం చెరువులోకి బహిర్భూమికి వెళుతున్నానని స్నేహితులకు చెప్పి వెళ్లాడు. ఎంత సేపటికి రాకపోవడంతో స్నేహితులు చెరువులోకి వెళ్లి చూడగా గ్రావెల్ గుంతలో పడిపోయి ఉన్నాడు. స్నేహితుల సమాచారంతో గ్రామస్తులు గుంతలో నుంచి వెలికి తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. అయినా చిన్న ఆశతో ఆటోలో సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సాయి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

కొడవలూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు(58) మృతి చెందిన ఘటన మండలంలోని రేగడిచెలిక వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..గుర్తుతెలియని వృద్ధురాలు రేగడిచెలిక, రాచర్లపాడు గ్రామాల్లో భిక్షాటన చేస్తూ జాతీయరహదారి ఫ్లైఓవర్ వంతెనల కింద తలదాచుకుంటోంది. శనివారం రాత్రి రేగడిచెలిక వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి వేళ కావడం, వాహనాలు మృతదేహాన్ని తొక్కుకుంటూ వెళ్లడంతో మృతదేహం ఛిద్రమైంది. ఆదివారం స్థానికుల సమాచారంతో ఎస్సై అంజిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


లారీ మీద ఒరిగిన విద్యుత్ స్తంభం

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని ఎంపీ చక్కెర పరిశ్రమ సమీపంలో స్వర్ణముఖి బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం ఓ భారీ లారీ మలుపు తిరుగుతూ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. మేనకూరు సెజ్‌లోకి వెళ్తున్న లారీ మలుపు తిరిగే క్రమంలో 11 కేవీ లైన్ స్తంభంను తగిలింది. దీంతో స్తంభం ఒరిగిపోయి లారీ మీద పడింది. అదే సమయంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో లారీ డ్రైవర్‌తో పాటు క్లీనర్ సురక్షితంగా విద్యుత్ ప్రమాదం నుంచి బయట పడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పత్రికలు పంచి వెళ్తూ..

- ఆగిఉన్న లారీని ఢీకొని పెళ్లి కుమారుడి దుర్మరణం


ప్రభుత్వ ఆస్పత్రిలో బాలయ్య మృతదేహం


బాలయ్య(ఫైల్)

కాదలూరు(తడ): మరో మూడు రోజుల్లో పెళ్లి. ఎంతో సంతోషంగా బంధువులకు పెళ్లి పత్రికలు ఇచ్చి మోటారుసైకిల్‌పై ఇంటికి తిరిగి వెళ్తున్న పెళ్లి కుమారుడు రోడ్డుపై ఆగిఉన్న లారీని ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కాదలూరు వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. చిత్తూరు జిల్లా వరదయ్యపాళెం మండలం కారిపాకం గ్రామానికి చెందిన కొండేటి బాలయ్య(24) తడ మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని సుందరపురం వద్ద ఉన్న ఓ ప్రైవేటు వ్యాపార సంస్థలో పని చేస్తున్నాడు. ఈ నెల 30న వివాహం నిశ్చయం కావడం..తండ్రి పక్షవాతంతో బాధపడుతుండడంతో తానే బంధువులకు పెళ్లి పత్రికలు పంచుతున్నాడు. పెళ్లి సమయంలో సెలవులు కావాల్సి ఉండడంతో విధులు ముగిశాక సాయంత్రం నుంచి రాత్రి వరకు బైక్‌పై తిరుగుతూ బంధువులను ఆహ్వానిస్తున్నాడు. ఈ క్రమంలోనే శనివారం విధులకు హాజరైన బాలయ్య సాయంత్రం సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లోని బంధువులకు పత్రికలు పంచి రాత్రి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. వర్షం కురుస్తున్నా బాగా చీకటి పడుతుందని తడుస్తూనే ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో కాదలూరు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ప్రమాదానికి గురై ఆగిపోయిన లారీని హైవే సిబ్బంది గానీ, పోలీసులు గానీ పక్కకు తొలగించకపోవడంతో వర్షంలో కనిపించక ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరో మూడు రోజుల్లో పెళ్లి పీటల మీద కూర్చోవాల్సిన బాలయ్య తిరిగిరాని లోకాలకు చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.భజంత్రీలు మోగాల్సిన ఇంట బంధు, మిత్రుల రోదనలు మిన్నంటాయి.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | సోమవారం | ఆగస్టు | 28 | 2017 సాక్షి

భవిష్యం

మేషం: పనులు సకాలంలో పూర్తి. సంఘంలో ఆదరణ. దూరప్రాంతాల నుంచి కీలక సమాచారం. భూలాభాలు. వృత్తి, వ్యాపారాలలో ఒత్తిడులు తొలగుతాయి.

వృషభం: చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. సేవలకు గుర్తింపు రాగలదు. ఆకస్మిక ధన, వస్తులాభాలు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు హోదాలు.



మిథునం: మిత్రులతో మాటపట్టింపులు. ధనవ్యయం. పనులు ముందుకు సాగవు. ప్రయాణాలు వాయిదా. వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి. ఉద్యోగులకు వివాదాలు.

కర్కాటకం: రుణయత్నాలు. ప్రయాణాలలో అవాంతరాలు. బంధువులతో విభేదాలు. అనుకోని ఖర్చులు. ఆరోగ్యభంగం. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

సింహం: పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆసక్తికర సమాచారం. ఇంటాబయటా అనుకూలం. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహం.

కన్య: కుటుంబసభ్యులతో స్వల్ప వివాదాలు. ఆర్థిక లావాదేవీలు మందగిస్తాయి. శ్రమాధిక్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నిరాశాజనకంగా ఉంటుంది.

తుల: పలుకుబడి పెరుగుతుంది. ఆస్తిలాభ సూచనలు. ప్రముఖులతో పరిచయాలు. బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలలో కొత్త పెట్టుబడులు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు.

వృశ్చికం: కొన్ని పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొన్ని మార్పులు.

ధనుస్సు: పలుకుబడి పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల నుంచి శుభవార్తలు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు సంతోషకర సమాచారం.

మకరం: నూతన ఉద్యోగప్రాప్తి. చిన్ననాటి మిత్రుల కలయిక. కీలక నిర్ణయాలు. వ్యవహారాలలో విజయం. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూలత.

కుంభం: పనుల్లో ప్రతిబంధకాలు. రాబడికి మించిన ఖర్చులు. అనారోగ్యం. కుటుంబ సభ్యులతో విభేదాలు. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు పనిఒత్తిడులు.

మీనం: కుటుంబసభ్యులతో వైరం. శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశాజనకంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నాయకులు

నెల్లూరు(సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటిన నిర్వహించనున్న మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని ఉద్యోగులు జయప్రదం చేయాలని యాదవ ఎంప్లాయీస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని విజయమహల్ గేటు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పెన్షన్ అమలు చేయకపోవడం వల్ల పదవీ విరమణ అనంతరం ఉద్యోగులు దుర్భర జీవితం అనుభవించాల్సి వస్తుందని అన్నారు. సెప్టెంబర్ ఒకటిన విజయవాడలో తలపెట్టిన మిలియన్ మార్చ్‌లో ప్రతి ఉద్యోగి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు హజరత్తయ్య, రవీంద్ర, పాపయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ మద్దతు

నెల్లూరు(టౌన్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటిన విజయవాడలో నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌కు బీటీఏ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ఘోషను ప్రభుత్వానికి వినిపించి పాత పెన్షన్ విధానాన్ని సాధించేంత వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

సీబీసీఎస్‌పై అవగాహన సదస్సు


కౌన్సిలర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ కళాశాలలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్ట నున్న చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం(సీబీసీఎస్)పై కౌన్సిలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యం, విలువలు, నైపుణ్యం పెంపొందించవచ్చని కళాశాల అధ్యయన కేంద్రం సమన్వయకర్త పద్మప్రియ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులకు దీటుగా విద్యాబోధన ఉంటుందని తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 7న ఆఖరు అని పేర్కొన్నారు.

29న నిరసన దీక్షను విజయవంతం చేయండి

నెల్లూరు(టౌన్): సీపీఎస్ విధానం అమలుకు నిరసనగా ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, వలిరాజులు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జీవితాంతం సేవలందించిన ఉద్యోగులు సీపీఎస్ విధానంతో పదవీ విరమణ తరువాత రోడ్డున పడుతున్నారని తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కండలేరులో 3.586 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో ఆదివారానికి 3.586 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు కండలేరు జలాశయం ఈఈ సురేష్ తెలిపారు. వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీరు కండలేరులో చేరుతుందని, సత్యసాయిగంగ కాలువకు 250 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయీస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నెల్లూరు వాతావరణం

గరిష్టం: 31.8°/ కనిష్టం: 26.1°

నేడు
భారీగా వర్షం కురిసే అవకాశం. బలమైన గాలులు వీచే అవకాశం. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టం: 32 సీ, కనిష్టం: 26 సీ

మంగళవారం
వర్షం కురిసే అవకాశం. గాలులు వీచే అవకాశం. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టం: 34 సీ, కనిష్టం: 26 సీ.

బుధవారం
చిరుజల్లులు కురిసే అవకాశం. గాలులు వీచే అవకాశం. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టం: 35 సీ, కనిష్టం: 26 సీ

రక్తదానంతో శారీరక ఆరోగ్యం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మేయర్ అజీజ్

నెల్లూరు (పొగతోట) : రక్తదానంతో శారీరక ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నగర మేయర్ అబ్దుల్‌అజీజ్ అన్నారు. ఆదివారం స్థానిక సుబేదార్‌పేటలో స్నేహిత్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు.రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. యువత రక్తదానంపై అవగాహన కల్పించుకుని ముందుకు రావాలని తెలిపారు.కార్యక్రమంలో కార్పొరేటర్ నూనె మల్లికార్జునయాదవ్, ఫౌండేషన్ నిర్వహకులు వెంకటేశ్వర్లు, వెంకటసురేష్, వెంకటసురేంద్రబాబు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలు పూజించడంపై ప్రజల్లో చైతన్యం

వినాయకచవితి రోజున వినాయకుడి మట్టి ప్రతిమలను పూజించడంపై ఈ దఫా ప్రజల్లో చైతన్యం వచ్చిందని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఆదివారం స్థానిక చిన్నబజార్‌లో గణేష్ మరాఠా మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి 60 ఏళ్ల కిందట నెల్లూరుకు వచ్చిన మరాఠీలు వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి కార్యదర్శి దేవాశేట్, టీడీపీ నేత నన్నేసాహెబ్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

తిరుమల సమాచారం

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 27 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	– ఖాళీ లేవు
రూ.50 గదులు	– ఖాళీ లేవు
రూ.100 గదులు	– ఖాళీ లేవు
రూ.500 గదులు	– ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ	– ఖాళీ లేవు
వసంతోత్సవం	– ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	– ఖాళీ లేవు

సోమవారం ప్రత్యేక సేవ : విశేష పూజ

నెల్లూరు బులియన్

24 క్యారెట్ల బంగారం
ఒక గ్రామ్ రూ.3,002

22 క్యారెట్ల బంగారం
ఒక గ్రామ్ రూ.2,780

వెండి కిలో రూ.40,100

వెండి గ్రాము రిటైల్ ధర రూ.42.00

(బులియన్ మార్కెట్ సమాచారం మేరకు)

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ చికెన్ ధరలు

బ్రాయిలర్	₹ 99
లేయర్	₹ 82
బ్రాయిలర్ చికెన్	₹152
స్కిన్‌లెస్ చికెన్	₹ 178
లేయర్ చికెన్	₹ 140

నిమ్మ ధరలు(బస్తా)

	సన్నవి	పెద్దవి	పండ్లు
వెంకటగిరి	500	1200	600
పొదలకూరు	1000	2400	600
గూడూరు	600-800	900-1400	300-600

వాతావరణం

రానున్న 24 గంటల్లో పశ్చిమ తీరం, తెలంగాణలో అక్కడక్కడ, దక్షిణ చత్తీస్‌గఢ్‌లలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవచ్చు. తూర్పు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు, ఒడిశా, మధ్య, ఈశాన్య భారతంలో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

గుంటూరు వాతావరణం

గరిష్టం కనిష్టం
30.4°/25.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.7	24.8
కోల్‌కతా	32.9	26.7
బెంగళూరు	26.5	21.0
ముంబై	29.8	25.2
చెన్నై	32.9	25.8

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
కాకినాడ	33.1/26.7	విజయవాడ	30.9/26.0
అనంతపురం	33.1/24.1	శ్రీకాకుళం	30.8/26.6
చిత్తూరు	33.0/26.2	విజయనగరం	30.8/26.6
తిరుపతి	33.0/26.2	కరీంనగర్	30.8/25.5
విశాఖపట్నం	31.8/27.6	గుంటూరు	30.4/25.0
నెల్లూరు	31.8/26.1	నిజామాబాద్	30.4/23.7
ఆదిలాబాద్	31.8/25.6	వరంగల్	30.3/25.0
నల్లగొండ	31.2/25.0	మహబూబ్‌నగర్	30.3/23.0
ఒంగోలు	31.1/26.6	హైదరాబాద్	30.2/23.0
కడప	31.1/25.0	రంగారెడ్డి	30.2/23.0
ఏలూరు	31.0/26.8	కర్నూలు	30.1/23.1
రాజమండ్రి	31.0/26.8	ఖమ్మం	29.8/21.6
తాడేపల్లిగూడెం	31.0/26.8	మెదక్	29.1/21.2

బుల్లితెర

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.07.30 నంద్యాల జడ్జిమెంట్
ఉ.09.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.09.30 నంద్యాల జడ్జిమెంట్
ఉ.10.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.10.30 నంద్యాల జడ్జిమెంట్
మ.12.00 నంద్యాల జడ్జిమెంట్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 పండగ వేళ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 ప్రేమకు స్వాగతం
ఉ.09.30 శివశంకర్
మ.12.00 కార్తికేయ
సా.06.00 లడ్డూబాబు
రా.09.00 పంజా



మూవీస్ నౌ
ఉ.10.00 ఏలియన్స్ ఇన్ ద ఎటిక్
ఉ.11.50 రష్ అవర్ 3
సా.04.45 డాన్ ఆఫ్ ద డెడ్
సా.06.45 థోర్
రా.09.00 ద కంజ్యూరింగ్



హెచ్‌బీవో
ఉ.06.00 జోనా హెక్స్
ఉ.10.52 ద డార్క్ నైట్
మ.01.23 ఐపీ మ్యాన్ 3
సా.05.00 ద అకౌంటెంట్
రా.10.49 ద హ్యాంగోవర్-2



స్టార్ మూవీస్
ఉ.06.56 టర్బో
ఉ.08.47 ఇండిపెండెన్స్ డే
మ.01.22 చైనీస్ జోడియాక్
మ.03.46 ద అవెంజర్స్
సా.06.42 గూస్‌బమ్స్



మా మూవీస్
ఉ.07.00 ఆడవాళ్లే అలిగితే
ఉ.09.00 సోగ్గాడు
మ.12.00 షాపింగ్ మాల్
సా.05.00 నమో వెంకటేశ
రా.09.00 దేవరకొండ వీరయ్య




జీ క్లాసిక్
ఉ.06.17 కాళీచరణ్
ఉ.09.21 జిగ్రీ దోస్త్
మ.12.36 హైసీయత్
రా.07.00 కుందన్
రా.09.00 శేష్‌నాగ్



కరెంటు కష్టాలు.. ఇంకెన్నాళ్లు

- వెంకటేశ్వరపురంలో ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు
- ఇబ్బంది పడుతున్న జనం



జనార్దన్‌రెడ్డికాలనీ ఏర్పాటుచేసిన విద్యుత్ టవర్

నెల్లూరు (వీఆర్సీ సెంటర్) : నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో అంతర్భాగమైన వెంకటేశ్వరపురంలో విద్యుత్ కష్టాలు వెంటాడుతున్నాయి. పేరుకు నగరంలో ఉంటున్నప్పటికీ పల్లెటూరు ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేయడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. కార్పొరేషన్ పరిధి 53, 54 డివిజన్లలో 40 వేల మంది జనాభా కలిగి, 8 వేల విద్యుత్ సర్వీసు కనెక్షన్లు ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతానికి కోవూరు ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుండటంతో ఇష్టానుసారంగా వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండేవారు. దీంతో స్థానిక ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజలతో కలిసి ఆందోళనలు నిర్వహించారు. 2012లో నెల్లూరు నుంచి ఈ రెండు డివిజన్లకు విద్యుత్ సరఫరాను అందించేందుకు సిద్ధపడ్డారు. వెంటనే నెల్లూరు నుంచి పెన్నానదిలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి జనార్దన్‌రెడ్డికాలనీలో సబ్‌స్టేషన్‌ను నిర్మించి విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తుండేవారు. అయితే 2015లో వచ్చిన వరదలకు పెన్నానదిలో వేసిన విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోయాయి. దీంతో మళ్లీ ఈ డివిజన్ ప్రాంత వాసులకు కోవూరు ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తూ ఉండటంతో వెతలు తప్పడం లేదు. నాయకులు, స్థానికులు అధికారులకు పరిస్థితి తెలపడంతో త్వరలో నెల్లూరు నుంచి నేరుగా 33 కేవీ లైన్ ద్వారా సరఫరా ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇందుకు సంబంధించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. పెన్నా నది అవతల టవర్, జనార్దన్‌రెడ్డి కాలనీలో ఓ టవర్‌ను నిర్మించి విద్యుత్ లైన్ లాగేందుకు రూ.70 లక్షలకు ఆమోదం లభించింది. అయితే సంబంధిత కాంట్రాక్టర్ ఈ పనులు చేయడంలో అలసత్వం వహించడం, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ సరఫరా అందడం లేదు. వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డి కాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, గాంధీగిరిజన కాలనీ ప్రాంత ప్రజలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండటంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గత ఐదారు రోజుల నుంచి ఈ ప్రాంతాల్లో విద్యుత్‌ను ఎడాపెడా కోత విధిస్తూ ఉండటం, రాత్రి సమయాల్లో సైతం విద్యుత్‌ను ఆపివేయడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరా చేయాల్సి అవసరం ఉంది.

నెలాఖరుకల్లా అందిస్తాం :



నగరం నుంచి వెంకటేశ్వరపురానికి విద్యుత్‌ను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ప్రాంత వాసులకు ఈ నెలాఖరులోగా నెల్లూరు నుంచి నేరుగా విద్యుత్ అందించి ఎలాంటి కోతలు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి ఈ ప్రాంతంలో శాశ్వతంగా నెల్లూరు విద్యుత్ సరఫరా అందిస్తాం.

- కె.విజయకుమార్‌రెడ్డి, ఎస్ఈ

పేదల ఇళ్లను కూల్చితే ఊరుకోం



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న నగర ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లను కూల్చితే చూస్తూ ఊరుకోమని నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. నగరంలోని 53వ డివిజన్ సాలుచింతల, వారధి సెంటర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఎదురుగా 40 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నారని, ఇప్పుడు రోడ్డు వెడల్పు పేరుతో ఇళ్లన్నీ తొలగిస్తామని అధికారులు చెబుతున్నారన్నా రు. రోడ్డు అవతల ఉన్న వారికి అక్కడే పట్టాలు ఇచ్చి నివాసాలు కల్పించారని, రోడ్డు ఇవతల ఉన్న వారిని మాత్రం ఎక్కడో దూర ప్రాంతానికి వెళ్లమని చెబుతున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ రికార్డ్స్ ప్రకారం కట్టకు సంబంధం లేకుండా పక్కనే 4.40 సెంట్లు భూమి ఉందని, వీరికి మాత్రం రెండెకరాల భూమి సరిపోతుందని ఈ స్థలంలో పట్టాలు ఇచ్చి నివాసాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇల్లు నిర్మించుకునేందుకు హౌసింగ్‌లోను సదుపాయం కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సంవత్సరం తర్వాత ఇప్పుడు వచ్చి ప్రొక్లెయిన్లతో ఇళ్లు తొలగిస్తామని చెప్పి వారిలో భయాందోళనలు కలిగించడం సరికాదన్నారు. ప్రజలే సొంతంగా స్థలం చూసి అధి కారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా సర్వే చేయడానికి అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని, కలెక్టర్‌ను కలిసి కట్టకు సంబంధంలేని 4 ఎకరాల స్థలం విషయం తెలియజేస్తామని తెలిపారు. కార్పొరేటర్ దేవరకొండ అశోక్, నాయకులు నాగరాజు, జమీర్, అన్వర్, కేవీఆర్ శీను, కరిముల్లా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

నెల్లూరు రూరల్ : నగరంలోని ఎస్ పార్క్ హోటల్ సమావేశ మందిరంలో అమ్మునూరు టెక్నాలజీస్, వెబ్ డిజి టల్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా నెల్లూరు బ్రాంచ్ చైర్మన్ వెంకటశేషయ్య, సెక్రటరీ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ)పై వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అమ్మునూరు టెక్నాలజీ, వెబ్ డిజిటల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో చార్టెడ్ అకౌంట్స్‌కు (సీఏ) జీఎస్టీ రిటర్న్స్ వెబ్ అప్లికేషన్ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మునురు టెక్నాలజీస్ సంస్థ అధినేత ధనలక్ష్మి, నెల్లూరు బ్రాంచ్ మేనేజర్ శ్రీచరణ్, సీఏలు తదితరులు పాల్గొరు.

ముంబయి, బెంగళూరు తరహాలో

నగరం సుందరీకరణ

- కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు



వాల్ పెయింట్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు (పొగతోట) : ముంబయి, బెంగళూరు, విశాఖపట్నం, విజయవాడ తరహాలో నెల్లూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామని కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు తెలిపారు. ఆదివారం రైల్వేఫీడర్స్ రోడ్డులో రైల్వేస్టేషన్ నుంచి సింహపురి హోటల్ వరకు వేస్తున్న వాల్ పెయింట్స్‌ను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో గోడలపై పిచ్చిపిచ్చి రాతలు వాల్ పోస్టర్ల ఏర్పాటు వల్ల కళా విహీనంగా ఉన్నాయన్నారు. వాల్స్‌ను సుందరంగా తీర్చిదిద్దేలా బబుల్స్, ట్రాంగిల్స్, రెయిన్‌బో, రైలు తదితర వాటితో సుందరంగా పెయింట్స్ వేస్తున్నామన్నారు. దాతల సహకారం, కార్పొరేషన్ నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నగరంలో 30 నుంచి 40 వాల్స్‌ను గుర్తించా మని, వాటిని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీఎంఆర్ షాపింగ్ మాల్ వారి సహకారంతో రైల్వేఫీడర్స్‌రోడ్డులో పెయింట్స్ వేయిస్తున్నామన్నారు. దీని వల్ల గోడలపై పిచ్చిరాతలు రాసే అవకాశం ఉండదని తెలిపారు. నెల రోజుల్లో నెల్లూరు నగరంలో ఉన్న వాల్స్‌ను వివిధ రకాల పెయింట్లతో సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు (వీఆర్సీసెంటర్) : స్థానిక వెంకటేశ్వరపురం అంబేడ్కర్‌కాలనీ వద్ద ఆదివారం ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. అదే ప్రాంతానికి చెందిన గున్నం ప్రతాప్ గత కొంత కాలంగా నెల్లూరులో నివాసం ఉంటూ ప్రతిరోజూ వెంకటేశ్వరపురానికి వస్తూ వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు ప్రతాప్‌పై కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం నారాయణ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో ప్రతాప్‌పై అతని బంధువులు ఈ దాడికి పాల్పడినట్లు తెలిసింది.

అప్పులు తీర్చలేక యువకుడి ఆత్మహత్య


శ్రీనివాసులు(ఫైల్)

వింజమూరు: అప్పులు తీర్చలేక యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వింజమూరులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. వింజమూరుకు చెందిన గునుపూడి శ్రీనివాసులు(32) ఓ నగల దుకాణంలో గుమస్తాగా పనిచేస్తూ చీటీలు కట్టిస్తుండేవాడు. ఈ క్రమంలో తాను సొంతంగా చీటీలు వేస్తూ కట్టిన వారికి సక్రమంగా ఇస్తూ నమ్మకం పొందడంతో పాటు పలువురి వద్ద అప్పులు చేశాడు. ఇటీవల అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో అప్పుల వారి ఒత్తిడి ఎక్కువైంది. అప్పులు ఇచ్చిన వారికి ముఖం చూపలేక శనివారం అర్ధరాత్రి పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించిన వింజమూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అంబులెన్స్‌లో ఆత్మకూరుకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడికి తల్లి, భార్య, రెండేళ్ల కుమారుడు, మూడ్రోజుల పాప ఉన్నారు. శ్రీనివాసులు మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రూ.5కోట్లకుపైగా అప్పులు

శ్రీనివాసులుకు సుమారు రూ.5కోట్ల మేర అప్పులు ఉన్నట్లుగా సమాచారం. పట్టణంలోని వ్యాపారులు పెద్ద మొత్తాల్లో అప్పులు ఇచ్చినట్లుగా వాపోతున్నారు. శ్రీనివాసులు అప్పులు తెచ్చిన నగదుతో బ్యాంకుల వేలం వేసే బంగారాన్ని కొనుగోలు చేసి విక్రయిస్తుండేవాడని వ్యాపారులు చెబుతున్నారు. ఈ క్రమంలో బంగారాన్ని ఎవరి వ్యాపారికి విక్రయించి మోసపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. దీంతో అప్పులు తీర్చలేక ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని చెబుతున్నారు. శ్రీనివాసులుకు రెండు కార్లు కూడా ఉన్నాయి. వాటికి సంబంధించిన డ్రైవర్లకు లేదా స్నేహితులకు మోసపోయిన విషయం తెలిసి ఉండవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు.

కార్గో సేవలు విస్తృతం

- రోజుకు రూ.3లక్షల ఆదాయమే లక్ష్యం
- ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ మహేశ్వర్


కార్గో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఈడీ మహేశ్వర్

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీని ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు కార్గో(వస్తు రవాణా) సేవలను విస్తృతం చేస్తున్నట్లు ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ మహేశ్వర్ వెల్లడించారు. నెల్లూరు ప్రధాన బస్టాండ్‌లో కార్గో నూతన కార్యాలయాన్ని ఆదివారం ఆయన ఆర్‌ఎం జీవీ రవివర్మతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మహేశ్వర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల ద్వారా ఏఎన్‌ఎల్ పార్శిల్(ప్రైవేటు) సంస్థ వస్తువులను వివిధ ప్రాంతాలకు రవాణా చేసేదని తెలిపారు. అయితే ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వస్తు రవాణాను స్వయంగా చేపట్టాలని నిర్ణయించి గతేడాది జూన్‌లో కార్గో సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రస్తుతం కార్గో ద్వారా నెల్లూరు జోన్ పరిధిలో రోజుకు రూ.1.50లక్షలు ఆదాయం వస్తోందన్నారు. ఏఎన్‌ఎల్ పార్శిల్ సంస్థ కాలపరిమితి శనివారంతో ముగిసిందన్నారు. ఇకపై ఆర్టీసీ బస్సుల్లో పూర్తిస్థాయి వస్తు రవాణా ఆర్టీసీ కార్గో వ్యవస్థ ద్వారానే జరగనుందన్నారు. రాబోవు రోజుల్లో రోజుకు రూ.3లక్షల ఆదాయం సాధించాలని లక్ష్యంగా చర్యలు చేపట్టామన్నారు. ఆర్టీసీ ఆర్‌ఎం రవివర్మ మాట్లాడుతూ కార్గో సేవలు జిల్లాలోని పది డిపోలతో పాటు ముత్తుకూరు, వింజమూరు ప్రాంతాల్లో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇతర పార్శిల్, కొరియర్ సర్వీసుల కంటే 20శాతం తక్కువ ధరకే వస్తు రవాణా చేస్తున్నామన్నారు. కార్గోలో పార్శిల్ చేసిన వ్యక్తికి సర్వీస్ నంబర్, డ్రైవర్ నంబర్ ఇవ్వడం వినియోగదారుల్లో నమ్మకాన్ని పెంపొందించిందన్నారు. ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వ్యాపారుల సౌకర్యార్థ ఏసీ బస్సుల్లోని లగేజ్ స్థలం, సూపర్‌లగ్జరీ బస్సుల లగేజీ డిక్కీ స్థలం, కొత్తగా వచ్చిన అద్దె బస్సుల్లోని లగేజీ స్థలాన్ని నెలవారి అద్దె ప్రాతిపదికన ఇస్తామన్నారు. కార్గో సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 73829 26466 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ మార్కెటింగ్ అధికారి పీవీ శేషయ్య, డిప్యూటీ సీటీఎం జి సత్యనారాయణ, కమర్షియల్ ఏటీఎం కృష్ణారావు, ఆర్టీసీ నెల్లూరు-1,2 డిపోల మేనేజర్లు శీనయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఊపందుకొన్న నిమ్మ ధరలు

- రూ.4వేలు పలుకుతున్న లూజు బస్తా
- నిమ్మ రైతుల్లో చిగురించిన ఆశలు


మార్కెట్‌కు చేరిన నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం


గూడూరు: నిమ్మ ధరలు ఊపందుకొన్నాయి. వారం రోజులుగా ధరలు పెరగడంతో నిలకడ లేని నిమ్మ ధరలతో అతలాకుతలమవుతున్న నిమ్మ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత మంగళవారం గరిష్ఠంగా లూజు బస్తా రూ.4 వేలు పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రెండు రోజుల పాటు ధరలు రూ.3వేలకు తగ్గడంతో మళ్లీ దిగాలు పడ్డారు. ఈ క్రమంలోనే మళ్లీ ఆదివారం రూ.4 వేలు పలకడంతో కొంత మేర ఊరట చెందారు.

జిల్లాలోని గూడూరు, పొదలకూరు, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, ఓజిలి, రాపూరు, కలువాయి, తదితర మండలాల్లో సుమారు 25 వేల హెక్టార్లలో నిమ్మ సాగవుతోంది. గతంలో ఏడాది పొడవునా నిమ్మ ధరల్లో ఆటుపోటులు ఉన్నా, కనీసం సీజన్‌లోనైనా ధరలు పలికేవి. కానీ ఈ ఏడాది సీజన్‌లోనూ ధరలు అంతంత మాత్రంగా ఉండడంతో పాటు ధరలు పలికిన మరుసటి రోజే పతనమవుతుండడంతో రైతన్నలు నష్టపోయారు. ఈ క్రమంలోనే ఈ నెల 6న గరిష్ఠంగా లూజు బస్తా రూ.3500 పలకడంతో నిమ్మ రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షాభావ పరిస్థితులతో చెట్లను కాపాడుకునేందుకు బోర్ల మీద బోర్లు వేసి అప్పుల పాలైన రైతులు ఊరట చెందారు. గత మంగళవారం కూడా అదే ధరలు పలకడంతో ఇక తమ అప్పులు తీరినట్లేనని ఊపిరి పీల్చుకున్నారు. ఆ తరువాత రోజు బుధవారం సెలవు కావడం, గురువారం వచ్చే సరికి ఒక్కసారిగా లూజు బస్తాపై రూ.1000 మేర ధరలు పడిపోవడంతో నిమ్మ రైతన్నల ఆశలు రెండు రోజుల్లోనే ఆవిరైపోయాయి. మళ్లీ ఆదివారం లూజు బస్తా ధర రూ.4 వేలు పలకడంతో ఊరట చెందుతున్నారు.

గతేడాదితో పోల్చితే సగానికి సగమే

గతేడాది ఏప్రిల్‌లో లూజు బస్తా రూ.8వేల వరకు పలికింది. ఒకటిన్నర నెల పాటు నిలకడగా లూజు బస్తా కాయలు రూ.6వేలు పలికాయి. ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించలేదు. గరిష్ఠంగా రూ.4వేలు పలికినా ఎక్కువ రోజుల పాటు నిలకడ లేకపోవడంతో నిమ్మరైతుల ఆశలు అడియాశలయ్యాయి. నిమ్మ సీజన్ అయిపోవడంతో ఇక అప్పులెలా తీరుతాయాని మదనపడుతున్న నిమ్మ రైతులకు ఆగస్టు మాసం కాస్తా ఊరటనిచ్చింది. సీజన్ అయిపోయాక లూజు బస్తా రూ.4 వేలకు పెరగడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

కాయలు తగ్గడంతో ధరలు పెరిగాయి



ఈ ఏడాది వేసవి సీజన్‌లో నిమ్మకాయలు ధరలు పెద్దగా పలకలేదు. పలికిన ధరలు ఎక్కువ రోజులు ఉండలేదు. ఇక పెట్టిన పెట్టుబడులు కూడా రావనుకుంటున్న తరుణంలో ఆగస్టులో అనూహ్యంగా ధరలు పలుకుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. -ఎం పెంచలయ్య, గరిమెనపెంట, రాపూరు


ధరలు నిలకడగా ఉండడం లేదు



నిమ్మకాయల ధరలు నిలకడగా ఉండడం లేదు. మార్కెట్‌కు కాయలు ఎక్కువగా వస్తే వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారు. కాయలు తక్కువగా వస్తే మాత్రం ధరలను పెంచడం లేదు. ధరలు నిలకడగా ఉంటే రైతులు నష్టపోరు. -వై అంకయ్య,మర్లపూడి, సైదాపురం

బీఎమ్మార్ ఆమోదిస్తేనే రుణాలు

- కార్పొరేషన్ రుణలబ్ధిదారుల ఎంపికపై ఆంక్షలు
- టీడీపీ కార్యాలయం నుంచి స్థానిక సంస్థల ప్రతినిధులకు సందేశాలు
- మండిపడుతున్న దరఖాస్తుదారులు


ఎంపీటీసీలకు అందిన ఎస్‌ఎంఎస్

బిట్రగుంట: కావలి నియోజకవర్గంలో అధికార పార్టీ బరి తెగించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టబద్ధంగా పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలకు మాత్రమే అందించేందుకు ప్రజల సొమ్మును పప్పుబెల్లాలుగా పంపిణీ చేసేందుకు సొంత నిబంధనలు రూపొం దించుకుంది. ఈ మేరకు స్థానిక సంస్థల ప్రతినిధులకు ఎస్‌ఎంఎస్‌లు సైతం పంపింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఎస్‌ఎంఎస్‌లు కలకలం సృష్టిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..బోగోలు మండలంలో కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు నిరుపేదలు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. రుణాల ద్వారా జీవనోపాధిని మెరుగుపరుచుకోవచ్చని మీసేవ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి 1563 మంది పేదలు దరఖాస్తులు అందజేశారు. ఈ నెల 23న మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు సైతం నిర్వహించారు. కాగా రుణాలు ఎవరికి ఇవ్వాలి అనే అంశంపై కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు కార్యాలయం నుంచి స్థానిక సంస్థల ప్రతినిధులకు ఎస్‌ఎంఎస్‌లు అందాయి. పార్టీ కార్యాలయంలో జరిగిన తప్పిదం కారణంగా టీడీపీతో పాటు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులకు సందేశాలు రావడంతో అసలు విషయం వెలుగు చూసింది. టీడీపీ నేతలు, జన్మభూమి కమిటీ సభ్యులు తుది జాబితా తయారు చేసి బీఎమ్మార్ కార్యాలయానికి పంపాలని, అక్కడ మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌రావు ఆమోదం పొందిన తరువాతే తుది జాబితాను ఎంపీడీఓ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని ఉండటంతో దరఖాస్తుదారుల్లో కలకలం రేగింది.

ఎస్‌ఎంఎస్‌లో ఏం ఉందంటే...

స్థానిక సంస్థల ప్రతినిధులకు ఈ నెల 24న 'బీపీ-బీఎమ్మార్ టీడీపీ' అనే కస్టమ్ డొమైన్ పేరుతో రుణాల ఎంపికకు సంబంధించిన ఎస్‌ఎంఎస్ అందింది. 'మండలంలోని పంచాయతీల్లో కార్పొరేషన్ రుణలబ్ధిదారుల ఎంపికను మనపార్టీకి చెందిన సర్పంచ్, ఎంపీటీసీ, ముఖ్య నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులతో సమిష్టిగా ఎంపిక చేసి జాబితాను కావలి పార్టీ కార్యాలయానికి 25వ తేదీ మధ్యాహ్నం లోగా చేర్చవలెను. నియోజకవర్గ ఇన్‌చార్జి బీద మస్తాన్‌రావు గారు ఆమోదం తెలిపిన అనంతరం ఎంపీడీఓ జాబితాను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేస్తారని' నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం, కావలి పేరుతో సందేశం అందింది. దీంతో లబ్ధిదారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

భగ్గుమంటున్న దరఖాస్తుదారులు

కావలి టీడీపీ కార్యాలయం నుంచి వచ్చిన మెసేజ్‌లు బయటకు రావడంతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. రుణాలు ఎవరికి ఇవ్వాలో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నిర్ణయించే పనైతే దరఖాస్తులు స్వీకరించడం, ఇంటర్వ్యూలకు పిలవడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. అసలు రుణాల లబ్ధిదారులను నిర్ణయించేందుకు వీళ్లకి ఏం అధికారం ఉందని నిలదీస్తున్నారు. రుణాల రూపంలో ఇచ్చేది ప్రజల సొమ్మేనని, పార్టీ ఫండ్ కాదనే విషయం గుర్తుంచుకోవాలని హితవు పలుకుతున్నారు. టీడీపీ కార్యకర్తలకే రుణాలు ఇవ్వాలని అంత ఉబలాటంగా ఉంటే సొంత నిధులు ఇచ్చుకోవాలని సూచిస్తున్నారు.

ఈదురుగాలులతో వర్షం

ఓజిలి : మండల పరిధిలోని మాచవరం, ఓజిలి, తిరుమలపూడి, కుందాం, కొత్తచెరువు, ఓజిలి, పెదపరియ, కారూరు తదితర గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామాలకు వెళ్లే రహదారులు చిత్తడిగా మారాయి. పాదచారులు బురదలో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. చెరువుల్లో కొద్దిపాటి నీరు చేరడంతో రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. సెప్టెంబర్ నెల మొదటి వారంలో ఎల్లిపైర్లు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు పిల్లిపెసర, జీలుగులు సాగు చేస్తున్నారు.

వర్షంతో నేల వాలిన వరి


తంబుగారిపాలెం వద్ద నేల వాలిన వెన్నుదశలోని పైరు

చిట్టమూరు: మండలంలో ఆదివారం వేకువన కురిసిన వర్షానికి వరిపైరు నేలవాలింది. ఎడగారు కింద తాడిమేడు, ఆరూరు, తంబుగారిపాలెం, ఈశ్వరవాక, గునపాడు, గునపాటిపాలెం, మెట్టు, తిమ్మారెడ్డివాగు, తదితర గ్రామాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పైరు వెన్ను దశలో ఉంది. వర్షానికి తోడు బలలమైన గాలులు వీయడంతో పైరు నేలవాలింది. వెన్ను దశలోనే పంట వాలిపోతే దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా మరి కొన్ని గ్రామాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. వర్షంతో కల్లాలోని ధాన్యం తడిసిపోవడం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు.

మీరు విచారణకు రావొద్దు

■ నెల్లూరు సిటీ, రూరల్ ఎమ్మెల్యేలకు చెప్పిన పోలీసులు
■ విచారణ అధికార పార్టీ కుట్రగా తేలిన వైనం

నెల్లూరు(సెంట్రల్) : జిల్లాలో సంచలనం కలిగించిన క్రికెట్ బెట్టింగ్ మరక వైఎస్సార్ సీపీపై రుద్దేందుకు ప్రయత్నించిన టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. నంద్యాల, కాకినాడ ఎన్నికల నేపథ్యంలో రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు హడావుడిగా నెల్లూరు, రూరల్ ఎమ్మెల్యేలు డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు నోటీసులిచ్చి విచారణ చేసిన పోలీసులు చివరకు వారి పాత్ర లేదని పరోక్షంగా స్పష్టంచేశారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే టీడీపీ ఆడిన డ్రామాగా తెలిసింది. ఎమ్మెల్యేలను ఆదివారం విచారణకు రావాల్సిందిగా ఈనెల 22వ తేదీన పోలీసులు చెప్పారు. ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీధర్‌రెడ్డి పోలీసు కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం తదుపరి విచారణకు రావాల్సిన అవసరం లేదని ఆయనకు పోలీసులు తెలిపారు. అదే విధంగా అనిల్ కూడా విచారణకు రావాల్సి ఉండగా ఏఎస్పీ అనిల్‌కు ఫోన్ చేసి విచారణకు రావాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఒత్తిళ్ల మేరకే..

గత కొంతకాలంగా జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు తమ పార్టీ నాయకుల పేర్లు బయటికి రాకుండా అంశాన్ని పక్కదారి పట్టించేందుకు జిల్లా పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి ఈ తతంగాన్ని నడించారు. బెట్టింగ్ వ్యవహారాన్ని వైఎస్సార్ సీపీపై నెట్టి లాభం పొందాలని తెర వెనుక రాజకీయ కుట్రకు తెర లేపారు. తొలుత ఎమ్మెల్యేలకు సంబంధంలేదని సాక్షాత్తు ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ కృష్ణసింగ్‌ను అరెస్ట్ చేసిన సమయంలో ప్రకటించారు. అయితే ఈనెల 14వ తేదీన ఓ పత్రికలో వచ్చిన కథనంతో నేరుగా జిల్లా ఎస్పీని రూరల్ ఎమ్మెల్యే కలిసి ఎవరి పాత్ర ఉన్నా అరెస్ట్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తుల పాత్రకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని స్పష్టంచేశారు. ఈనెల 18న వెంకటగిరిలో కూడా ఎమ్మెల్యేలకు సంబంధలేదనే చెప్పారు. అయితే నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న నగర, రూరల్ ఎమ్మెల్యేలకు ఈనెల 20న నోటీసులు జారీచేశారు. తొలుత ఎమ్మెల్యేల పాత్ర లేదని చెప్పాన ఎస్పీ ఆ తర్వాత ఎవరి ఒత్తిళ్లతో నోటీసులు ఇచ్చారనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నోటీసుల జారీ వెనుక అధికార పెద్దల కుట్ర బలంగా ఉన్నట్లు స్పష్టంగా ఉన్నట్లు అర్థమవుతోంది. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఈ విషయం చేసినట్లు తెలుస్తోంది. టీడీపీ నేతల ఒత్తిళ్లతో నోటీసులిచ్చిన పోలీసులు విచారణ అనంతరం ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీకి జరిగిన నష్టాన్ని ఏ విధంగా భర్తీ చేస్తారో చెప్పాల్సిన అవసరముందని పలువురు కోరుతున్నారు.

గ్రూపు రాజకీయాలతో ఆగిన సంస్థాగత ఎన్నికలు

➡ చింతాకు చేదు అనుభవం
➡ ముఖం చాటేసిన పనబాక



శివాచారి, చింతా అనుచరుల మధ్య వాగ్వాదం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : గ్రూపు రాజకీయాలతో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలు ఆగిపోయాయి. ఈ క్రమంలో మాజీ ఎంపీ, ఏఐసీసీ సభ్యుడు చింతా మోహన్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం నెల్లూరులోని ఇందిరాభవన్‌లో పార్టీ మండల, బూత్‌లెవల్ అధ్యక్షుల ఎన్నిక కార్యక్రమం జరిగింది. దీనికి చింతామోహన్ విచ్చేశారు. ఈ సమయంలో బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి శివాచారి ఈ కార్యక్రమం మండలస్థాయి నాయకులదని, ఇలా నాయకులతో రావడం సరికాదని, వెంటనే అందర్నీ వెళ్లిపోవాలని చెప్పారు. దీంతో చింతా అనుచరులకు శివాచారి అనుచరులకు వాగ్వాదం చోటుచేసుకుంది. చింతా వర్గీయులు మాత్రం అక్కడే ఉండగా నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరాభవన్‌లోని కుర్చీలు, మైక్ సెట్‌లను తీసుకెళ్లారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా నియమించిబడ్డ తమిళనాడుకు చెందిన తిక్కరయణ్, గణేష్‌లు విషయం తెలుసుకుని ఇందిరాభవన్‌కు రాకుండానే వెనుదిరిగారు. దీంతో పీసీసీ ఉపాధ్యక్షుడు ఈ కార్యక్రమం వాయిదా పడిందని అందరూ వెళ్లిపోవాలని చెప్పారు. ఆయనతోపాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు సీవీ శేషారెడ్డి, చెంచలబాబుయాదవ్, బాలసుధాకర్, రఘురాంముదిరాజ్, అనురాధరెడ్డి, లతారెడ్డిలు తమ అనుచరులతో వెళ్లిపోయారు. అయితే చింతా మోహన్, ఆయన అనుచరులు మాత్రం మధ్యాహ్నం మూడుగంటల వరకు అక్కడే వేచి ఉండి తర్వాత బయలుదేరారు. ఇక్కడి పరిణామాలను ఫోన్ ద్వారా తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య కార్యక్రమానికి రాకుండా ముఖం చాటేశారు.

నవరత్నాలు ఆణిముత్యాలు

■ వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన
■ నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రాజమోహన్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం(కోవూరు) : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల పథకాలు ఆణిముత్యాలని ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు రుక్మిణి కల్యాణమండపంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన నవరత్నాల సభలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జన్నత్‌హుస్సేన్ తీసుకెళ్లిన ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేశాడన్నారు. రూ.75 పింఛన్‌ను రూ.200 పెంచి అర్హులైన వారందరికీ పింఛన్లు అందేలా చేశాడన్నారు. ఇవే కాకుండా ఎన్నికల్లో ఇవ్వని వాగ్దానాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రూ.2కే కిలో బియ్యం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో దేవుడిగా కొలువయ్యాడన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని కోరుతూ అమలు చేయగల తొమ్మిది పథకాలను ప్రకటించాడన్నారు. కానీ చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబునాయుడి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. బాబు రాక్షసపాలనకు చరమగీతం పలికేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మండల కన్వీనర్లు నలుబోలు సుబ్బారెడ్డి, గంధం వెంకటశేషయ్య, మావులూరు శ్రీనివాసులురెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరిచలపతిరావు, ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, కోశాధికారి పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కార్యదర్శి షేక్ అల్లాబక్షు, చీమల రమేష్‌బాబు, గొల్లపల్లి విజయ్‌కుమార్, సూరా శ్రీనివాసులురెడ్డి, ఇప్పగుంట విజయ్‌భాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

పరువునష్టం దావా

నెల్లూరు సిటీ : క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి 15 రోజులుగా ఆంధ్రజ్యోతి పత్రికలో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ తనపై అసత్య కథనాలు ప్రచురించారని సోమవారం పరువునష్టం దావా వేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన హైదరాబాద్‌కు వెళ్లారు.

చంద్రబాబు బెదిరింపులకు భయపడేది లేదు

■ పోలీసుల చేత పొలిటికల్ డ్యూటీ చేయిస్తున్నారు
■ బుకీలతో మాట్లాడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోలీసు అధికారులకు నోటీసులిచ్చి విచారించండి
■ వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మద్దతుదారులతో తన కార్యాలయానికి వెళుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : సీఎం చంద్రబాబునాయుడి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, జిల్లా పోలీసు యంత్రాంగం చేత ఆయన పోలీసు డ్యూటీ కాకుండా పొలిటికల్ డ్యూటీ చేయిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఒకటన్నర గంటపాటు శ్రీధర్‌రెడ్డిని రెండోసారి క్రికెట్ బెట్టింగ్ కేసులో విచారణ జరిపారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మొదటి విచారణలో ఏవైతే ప్రశ్నలు వేశారో అవే ప్రశ్నలు మళ్లీ వేశారన్నారు. కొత్తగా బెంగళూరులో అకౌంట్ ఉందా? మీకు అకౌంట్ ఉన్నట్లు మా వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని పోలీసులు చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు. తనకు అకౌంట్లు లేవని స్పష్టం చేశానన్నారు. తన అకౌంట్‌లు, కుటుంబసభ్యుల బ్యాంకు స్టేట్‌మెంట్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రశ్నలు, మాటలు తప్ప తనపై వచ్చిన ఆరోపణలకు ఒక్క ఆధారం కూడా చూపించలేదని తెలిపారు. తనకు నోటీసులు ఇవ్వడం వెనుక రాజకీయ కుట్ర ఉందని స్పష్టం అవుతుందన్నారు. బాధ్యతగల ఎమ్మెల్యేగా విచారణకు సహకరిస్తున్నట్లు తెలిపారు. రూరల్ నియోజకవర్గ ప్రజలు తమ ఇంటి బిడ్డగా అధికార పార్టీ తీరును నిరసించాలని కోరారు.

నా జీతాన్ని పేదలకు ఖర్చుచేశాను..

ఎమ్మెల్యేగా తనకు వచ్చే జీతాన్ని పేద ప్రజల కోసం ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. శ్మశానవాటికలు, వాటర్‌ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. తనపై ఎన్ని రాజకీయ కుట్రలు చేసినా భయడపడనని చెప్పారు. ప్రభుత్వాలు ఎప్పుడూ ఒకటే ఉండవనే విషయాన్ని పోలీసులు గుర్తుంచుకోవాలన్నారు. అధికార పార్టీ అహంకారానికి వ్యతిరేకంగా మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ఎదురొడ్డి పోరాటం చేస్తానని తెలిపారు. అధికారం చేతుల్లో ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించి బుడ్డ బెదిరింపులకు దిగితే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు భయపడరని చెప్పారు.

పూర్తి విచారణ చేస్తే వెలుగులోకి నిజాలు


పోలీసు ఉన్నతాధికారికి మూడు సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది మంది క్రికెట్ బుకీల ఫోన్ కాల్‌లిస్ట్‌ను పరిశీలించాలన్నారు. ఏడాదిగా వీరు తరచూ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో గంటల తరబడి మాట్లాడారన్నారు. గన్‌మన్‌లు, డ్రైవర్‌లచే పోలీసు అధికారులు బుకీలతో మాట్లాడిన విషయాలు బయటపెట్టాలని కోరారు. గోవా పర్యటనలో మేయర్ అజీజ్‌కు కృష్ణసింగ్ ఆర్థికంగా సహాయపడ్డారా? అని ప్రశ్నించారన్నారు. దీనిపై అజీజ్‌ను విచారణ చేయాలన్నారు. బెట్టింగ్‌లో 400 మంది చిన్న చిన్న వారిని అరెస్ట్ చేశారన్నారు. బెట్టింగ్‌ను కూకటివేళ్లతో లేకుండా చేయాలనే పోలీసుల చర్యలు అభినందనీయమన్నారు. అయితే బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు ఎవరూ లేరా అని ప్రశ్నించారు. ఆ దిశగా విచారణ సాగించాలన్నారు. ఈ మూడింటిపై విచారణ జరపాలన్నారు. లేనిపక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా భారీగా జిల్లా ఎస్పీ కార్యాలయం వద్దకు ఎమ్మెల్యే మద్దతుదారులు చేరుకున్నారు. అధికార పార్టీ తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్పీ కార్యాలయం నుంచి శ్రీధర్‌రెడ్డి ర్యాలీగా కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద ఉండే ఆయన కార్యాలయానికి కాలినడకన వెళ్లారు.

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | సోమవారం | ఆగస్టు | 28 | 2017

నిమజ్జన కోలాహలం



జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపతి బప్పా మోరియా నినాదాలు.. డప్పుమోతల హోరు, యువత కేరింతలు..విద్యుద్దీపాలంకరణలు..హోరెత్తించే సినీ నృత్యగీతాల నడుమ నగరంలో గణేష్ నిమజ్జనోత్సవం ఆదివారం కోలాహలంగా సాగింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గృహాలు, నగరంలోని పలు కూడళ్లు, వీధుల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను పూజల నడుమ పెన్నమ్మ ఒడికి తరలించారు. సంతపేటసెంటర్‌లో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గణనాథులు నిమజ్జనోత్సవానికి తరలివెళ్లారు. – నెల్లూరు(బృందావనం)









బంగారు గరుడవాహనంపై ఊరేగిన శ్రీవారు



కోన మాడవీధుల్లో ఊరేగుతున్న నృసింహుడు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బంగారు గరుడ వాహనంపై కోన మాడవీధుల్లో ఆదివారం ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మండపంలో స్వర్ణ గరుడవాహనంపై శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో వేదపండితుల మంత్రోచ్చారణలతో కోన తిరువీధుల్లో క్షేత్రోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

లడ్డూ @ రూ.2 లక్షలు



డక్కిలి: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలను ఆదివారం నిర్వాహకులు వేలం వేశారు. పలువురు అధిక మొత్తానికి లడ్డూను దక్కించుకున్నారు. డక్కిలి మండలం మాటుమడుగులో ఏర్పాటు చేసిన పది కిలోల లడ్డూకు ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో వేలం వేశారు. గ్రామానికి చెందిన పోలంరెడ్డి పెంచలరెడ్డి రూ.రెండు లక్షలకు దక్కించుకున్నారు.

రూ.1.83 లక్షలు పలికిన లడ్డూ

మండలంలోని దగ్గవోలులో గ్రామ చావిడి వద్ద తూర్పు వీధి వాసులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూను ఆదివారం వేలం వేశారు. గ్రామానికి చెందిన దూడల రవి, సంక్రాతి వెంకటాద్రి రూ.1.83 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు.

హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు



హైజంప్‌లో విద్యార్థిని



పరుగు పందెంలో ఉత్సాహంగా విద్యార్థులు

మర్రిపాడు:

మండలంలోని కృష్ణాపురంలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం రెండో రోజు అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎనిమిది క్లస్టర్ల నుంచి 73 నవోదయ విద్యాలయాలకు చెందిన 471 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు లాంగ్‌జంప్, హైజంప్, పరుగు పందెలను నిర్వహించారు. ఈ పోటీల్లో బళ్లారి విద్యాలయానికి చెం దిన వారు 91 పాయింట్లతో ప్రథమ స్థానంలో, పుదుచ్చేరికి చెందిన విద్యార్థులు 73 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. షిమోగాకు చెందిన వి ద్యార్థులు 69 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలి చారు. పోటీలను ప్రిన్సిపల్ రాజన్ పర్యవేక్షించారు.




కావ్యాంజలి, ముత్తుకూరు


మోనిత, గగన్, నెల్లూరు


సాయిరామ్, చెర్లోపల్లి


సాయికృష్ణ, చెర్లోపల్లి


వైభవ్ కార్తీక్, నెల్లూరు


భూమన శ్రీశైల, దండిగుంట, విడవలూరు


అచ్యుత్, అనిరుధ్, వెంకటేష్, చిన్నపడుగుపాడు



మనోహర్, యాకేష్, కొండాపురం


ఉమారాణి, శరణ్, పప్పులవీధి, నెల్లూరు


భారతి, ప్రధానోపాధ్యాయురాలు, రెడ్డిపాలెం ఎంపీపీ పాఠశాల, వాకాడు మండలం

సెల్ఫీ విత్ గణేశ

‘సాక్షి’ పిలుపునందుకొని వినాయక చవితి సందర్భంగా పలువురు మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. పర్యావరణ హితమే ధ్యేయంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండి మట్టి వినాయకులను ఇళ్లలో ప్రతిష్ఠించి పూజలు చేశారు.ఆ ప్రతిమలతో ఫొటోలు దిగి ‘సెల్ఫీ విత్ గణేశ’కు పంపారు.


శ్రావ్య, సాయి, నెల్లూరు


నందు, వరుణ్, రిషిత, నెల్లూరు


సోమయాజుల సుమాంజలి, గూడూరు


వెంకటేశ్వర్లు, బారకాస్, నెల్లూరు


మస్తాన్, నరుకూరు


మనస్విని, మారుతీచరణ్, వెంకటేశ్వరపురం


రాకేష్, ఆత్మకూరు


దినేష్, నెల్లూరు

శాస్త్రోక్తంగా మహాద్వార బంధ స్థాపన

నెల్లూరు (బృందావనం): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం మహాద్వార బంధం స్థాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి గౌరవాధ్యక్షుడు, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సహకారంతో రూ.10కోట్లతో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి జూన్ 16న శంకుస్థాపన చేపట్టామని చెప్పారు. కేవలం 70 రోజుల్లో అంతే ప్రాముఖ్యత కలిగిన మహాద్వార బంధ స్థాపన చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏడాదిలోగా అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంకల్పంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు దాసా సురేష్‌రాజ, కార్యదర్శి ఐతా రామచంద్రరావు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, సుంకు మనోహరం, దొంతంశెట్టి వివేకానందం, సరాబు సుబ్రహ్మణ్యం, కోట సూర్యనారాయణ, పీఎన్నార్ రాము, చలువాది శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు



మహాద్వారబంధ స్థాపన చేస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు


ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన పీ నరసింహ

రేబాల (బుచ్చిరెడ్డిపాళెం) : ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రేబాల అమ్మవారితోపు సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రేబాల తూర్పుదళితవాడకు చెందిన పల్లం నరసింహ(38),శీనమ్మ దంపతులు చేపల గుంతల వద్ద కాపలాదారులుగా పనిచేస్తున్నారు. రాత్రి ముంబయి రోడ్డు పక్కనే ఉన్న గుంతల వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, దామరమడుగు వైపు నుంచి వస్తున్న మూడు ద్విచక్ర వాహనాల్లో ఒకటి వేగంగా ఢీకొనడంతో నరసింహం అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంలోని ఇద్దరు యువకులు చేతిలో మద్యం బాటిళ్లు పెట్టుకుని తాగుతూ వస్తూ ఢీకొన్నారు. ప్రమాదంలో యువకులు గాయపడగా 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

పీఎస్ఎల్వీ సీ39 అనుసంధానమిలా



మొదటిదశలో భాగంగా ప్రయోగవేదికపై రాకెట్‌ను అనుసంధానం చేస్తున్న దృశ్యం (రాకెట్ మొదటిదశను కేరళలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డిజైన్ చేసి తీసుకొచ్చి ఇక్కడ అనుసంధానం చేశారు. ఈ దశలో రాకెట్ నింగికి దూసుకెళ్లడానికి 138 టన్నుల ఘన ఇంధనాన్ని ఇందులో నింపుతారు)



షార్‌లోని క్లీన్‌రూంలో ఉపగ్రహానికి ఇంధనం నింపి పరీక్షిస్తున్న శాస్త్రవేత్తలు



రాకెట్ రెండోదశను అమర్చుతున్న దృశ్యం(రాకెట్ రెండోదశలో 2.8 వ్యాసార్థంలో ఉన్న మోటార్‌లో 42 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపుతారు. ఈ దశను కూడా వీఎస్ఎస్సీలోనే తయారు చేశారు.)

శ్రీహరికోట(సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం సిరీస్‌లో ఆఖరి శాటిలైట్ ఆర్ఎన్ఎస్ఎస్–1హెచ్ ఉపగ్రహాన్ని ఈ నెల 31న సాయంత్రం 6.59కి ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రయోగ తేదీని ఆదివారం ఇస్రో అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించి శనివారం రాకెట్ శిఖర భాగంలో ఉపగ్రహాన్ని అమర్చి హీట్‌షీల్డ్ క్లోజ్ చేశారు. అనంతరం రాకెట్ అనుసంధాన భవనంలో అనుసంధానాన్ని పూర్తి చేసి ఆదివారం ఉదయం ప్రయోగవేదిక మీదకు తీసుకెళ్లి అమర్చారు. 44.4 మీటర్లు ఎత్తున్న పీఎస్ఎల్వీ సీ39 రాకెట్ ప్రయోగ సమయంలో ఇంధనంతో కలిపి 320 టన్నుల బరువుతో నింగికి పయనమవుతుంది. శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని 20.19 నిమిషాల్లోనే పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.




రాకెట్‌లోని మూడోదశను అమర్చుతున్న దృశ్యం(ఈ దశ రెండు మీటర్లు వ్యాసార్థంలో ఉంటుంది. ఈ దశలో 7.6 టన్నుల ఘన ఇంధనాన్ని నింపుతారు)

రీప్లేస్‌మెంట్ ఉపగ్రహమిది

భారత్‌కు సొంతంగా దిక్సూచి (జీపీఎస్) వ్యవస్థను అందించేందుకు ఇస్రో భారత క్షేత్రీయ దిక్సూచి ఉపగ్రహ వ్యవస్థ (ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం)ను తయారు చేసింది. ఇందుకు ఏడు ఉపగ్రహాలు అవసరమవుతాయని గుర్తించింది. ఈ తరహా ఉపగ్రహాలను తయారు చేయడానికి ఇస్రో శాస్త్రవేత్తలు అనేక పరీక్షల తర్వాత 2013 జులై 1 దిక్సూచి వ్యవస్థలో మొట్టమొదటి ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్ 1ఏని విజయవంతంగా ప్రయోగించారు. తర్వాత ఏడవ ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్ 1జీని 2016 ఏప్రిల్ 28న ప్రయోగించి పూర్తి చేశారు. అయితే దిక్సూచి వ్యవస్థ అందుబాటులోకి వచ్చే సమయంలో మొట్టమొదట ఉపయోగించిన ఐఆర్ఎన్ఎస్ఎస్ 1ఏ ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తి పని చేయడం మానేసింది. దీంతో ఆ ఉపగ్రహం స్థానంలో ఈ నెల 31న ప్రయోగించబోయే ఐఆర్ఎన్ఎస్ఎస్ 1హెచ్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టి భారత్‌కు పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసుకున్న దిక్సూచి వ్యవస్థ అందుబాటులోకి తెస్తుంది.






రాకెట్ శిఖర భాగంలో ఉపగ్రహాన్ని అనుసంధానం చేస్తున్న దృశ్యం(నాలుగో దశ)



మొదటిదశలోనే కోర్ అలోన్ దశకు చుట్టూరా ఆరు స్ట్రాపాన్ బూస్టర్లను అమర్చిన దృశ్యం (320 టన్నుల బరువున్న రాకెట్‌ను మొదటి, రెండు, మూడు, నా లుగుదశల్లో నింపిన ఇంధనంతో పాటు 1400 కిలోల ఉపగ్రహం బరువును నింగికి తీసుకెళ్లాలంటే మొదటిదశకు మరింత చేదోడుగా చుట్టూరా ఆరు స్ట్రాఫాన్ బూస్టర్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్ మీటర్ వ్యాసార్థంలో ఉంటుంది. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 12.5 టన్నుల ఘన ఇంధనాన్ని నింపుతారు. బూస్టర్ల సాయంతో రాకెట్ ప్రయాణం ప్రారంభమవుతుంది.)



రాకెట్‌కు శిఖరభాగంలో ఉపగ్రహాన్ని అమర్చి హీట్‌షీల్డ్ క్లోజ్ చేస్తున్న దృశ్యం



ఉపగ్రహాన్ని అమర్చి పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం చేసిన దృశ్యం

మూతపడిన యూనిట్లకు మోక్షమెప్పుడు!

వికాస కేంద్రంలో శిథిలమైన బేకరి, బైడింగ్ సామాగ్రి

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రంలోని ప్లాంట్‌లు, యూనిట్‌లు మూతపడడంతో మహిళలకు ఉపాధి కరువవుతోంది. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా పనిచేయాల్సిన వికాస కేంద్రం తిరోగమనం దిశగా అడుగులు వేయటం గమనార్హం. గతంలో మూతపడిన వర్మీకంపోస్ట్, నర్సరీ ప్లాంట్‌లు ప్రస్తుతం పూర్తిగా ఉనికిని కోల్పోయాయి. అలాగే ఈ భవనంలో గతంలో పుస్తకాల బైండింగ్ వర్క్, బేకరీ ఉత్పత్తుల తయారీ విభాగాలు కొనసాగుతుండేవి. ప్రస్తుతం ఆ విభాగాల్లోని యంత్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, కనీసం మరమ్మతులకు కూడా పనికిరాని విధంగా ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన జిల్లా మేనేజర్ల నిర్లక్ష్యం కారణంగా మూతపడిన యూనిట్‌లను పునరుద్ధరించే అవకాశాలు సన్నగిల్లాయి. దీనికితోడు ఆదాయ వనరులు కూడా తగ్గుముఖం పట్టాయి. గతంలో బైడింగ్ వర్క్ జరుగుతున్న సమయంలో ఏడాదికి రూ.7 లక్షల వరకు ఆదాయం వచ్చేది. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు, పాఠశాలలకు స్టేషనరీని ఇక్కడ నుంచే సరఫరా చేసేవారు. ఏడాది క్రితం జిల్లా కేంద్రాల్లో స్టేషనరీ విభాగం అక్కరలేదని, రాష్ట్రమంతటికీ గుంటూరులోని ప్రధాన కేంద్రంలోనే కొనసాగాలని మహిళా ఆర్థిక సహకార సంస్థ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇక్కడి స్టేషనరీ విభాగం కాస్తా మూతపడింది. లాభాల దిశగా పయనిస్తున్నప్పటికీ వీటిని మూతవేయటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వికాస కేంద్రంలో గతంలో బేకరీ ఉత్పత్తులను తయారు చేసి వాటిని నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల, డీకేడబ్ల్యూ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసేవారు. అప్పట్లో ఈ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండేది. కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో కూడా వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఓ క్యాంటీన్‌ను ఏర్పాటుచేశారు. మహిళా ఆర్థిక సహకార సంస్థ నిర్లిప్తత, అప్పట్లో విధులు నిర్వర్తించిన జిల్లా మేనేజర్ల నిర్లక్ష్యం ఈ రెండు యూనిట్‌లకు శాపంగా మారాయి.



శిథిలావస్థలో ఉన్న బేకరి ఉత్పత్తుల యంత్రాలు, పరికరాలు



మూతపడిన స్టేషనరీ విభాగంలో మిగిలి ఉన్న ఉత్పత్తులు

పునరుద్ధరిస్తే పురోగమనమే

నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయా సందర్భాల్లో జరిగే ప్రభుత్వ అధికారిక, అనధికారిక కార్యక్రమాలు, సభలకు బయట కేటరింగ్ ద్వారా ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్నారు. ఇందుకు అధికారులు వేలాది రూపాయలను బిల్లులను చెల్లిస్తున్నారు. దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రంలో బేకరీ యూనిట్ పునరుద్ధరించినట్లయితే ఆ కార్యక్రమాలకు ఇక్కడి నుంచే ఆహార పదార్థాలు సరఫరా చేయ్యొచ్చు. ఫలితంగా మహిళలకు ఉపాధితో పాటు మహిళా ఆర్థిక సహకార సంస్థ ఆర్థికంగా బలపడుతుంది.

వస్తువులు పాడైపోయాయి..



వికాస కేంద్రంలోని బేకరి ఉత్పత్తుల యంత్రాలు, పరికరాలు, పూర్తిగా పాడైపోయాయి. స్టేషనరీ విభాగాన్ని గుంటూరులోని ప్రధాన కేంద్రానికి తరలించారు. ఇక మీదట అక్కడే స్టేషనరీ తయారీ జరుగుతుంది. స్టేషనరీ విభాగం ఇక్కడ ఉన్నప్పుడు ఆదాయం బాగానే ఉంది.

- విజయకుమారి, జిల్లా మేనేజర్, దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం

సూపర్ ఫజిల్ దిట్ట తేజేంద్ర



తయారు చేసిన షిప్‌తో రాజేంద్ర

వాకాడు: స్థానిక సెయింట్‌పాల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో మూడో తరగతి చదువుతున్న కుంచం తేజేంద్ర పలు రకాల వేస్ట్ మెటీరియల్‌తో పరికరాలు చేయడంలో దిట్ట. ఇందులో భాగంగానే ఆదివారం 245 విడిభాగాలు కల్గిన ముక్కల సూపర్ ఫజిల్‌ను ఒక్కటిగా కలుపుతూ అందమైన షిప్‌ను తయారు చేశాడు. గత ఆదివారం గ్లోబ్ ఈగల్‌ను ఒక గంట సమయంలో తయారు చేయగా, ఈ సారి మరింత స్పీడు పెంచి కేవలం 45 నిమిషాల్లోనే షిప్‌ను తయారు చేశాడు.

గిడుగు వెంకట రామమూర్తి జయంతి రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న రమేష్‌బాబు, గాలి కిరణ్‌కుమార్, అందె శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు (బృందావనం) : పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గిడుగు వెంకట రామమూర్తి జ యంతిని నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు తెలిపారు. పొగతోటలోని చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఆదివారం సెంటర్ అధినేత ఎస్వీ రమేష్‌బాబు ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. మురళీమోహన్‌రాజు మాట్లాడారు. గిడుగు జయంతిని పురస్కరించుకుని పురమందిరం ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు కవి సమ్మేళనం, సాహిత్య పురస్కారాలు ప్రదానం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన వింజమూరు మస్తాన్‌బాబు, గాలి కిరణ్‌కుమార్, అందె శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

నరాల వ్యాధులపై అప్రమత్తత అవసరం

• డాక్టర్ బిందుమీనన్


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బిందుమీనన్

నెల్లూరు (బారకాసు) : నరాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రముఖ నరాల వైద్య నిపుణురాలు డాక్టర్ బిందుమీనన్ అన్నారు. డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని నవాలకుల గార్డెన్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత నరాల వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మానవ శరీరంలో మెదడు కీలకమని, ఏ పని చేయాలన్నా అది చురుగ్గా పని చేసినప్పుడే నరాలు ఆరోగ్యంగా ఉన్నట్లుని తెలిపారు. మెదడులోని నరాలు సక్రమంగా పనిచేయకుంటే పక్షవాతానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూర్ఛ (ఫిట్స్) కూడా నరాలు వల్ల వస్తుందన్నారు. పక్షవాతం, మూర్ఛ వ్యాధులకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పొగాకు నమలడం, పొగతాగడం, మద్యం సేవించడం, ఒత్తిడి, కిడ్నీ వ్యాధుల కారణంగా నరాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పక్షవాతం, మూర్ఛ వ్యాధులకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించి తగిన వైద్య సేవలు పొందాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు రూరల్ : నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 125వ జయంతి (ఆగస్ట్ 29న)ని పురస్కరించుకుని తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజేత విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు, ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబు, మోపూరు పెంచల నరసింహం, సుభద్రాదేవి, వసతిగృహ సంక్షేమాధికారిణి మనోజ్ కుమారి పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ యువత రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

నెల్లూరు (బృందావనం) : పవన్‌కల్యాణ్ జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకుని చిరంజీవి యువత జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏసీ సెంటర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌కు చెందిన డిజిటల్ కమ్యూనికేషన్ అధ్యక్షుడు వై.వరప్రసాద్ మాట్లాడుతూ చిరంజీవి యువత, పవన్‌కల్యాణ యువత చేస్తున్న సేవలను అభినందించారు. చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా 150 మంది అభిమానులు రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, చిరంజీవి యువత, పవన్‌కల్యాణ్ యువత నాయకులు కె.ఉదయ్‌కుమార్, కారంపూడి కృష్ణారెడ్డి, వై.రవికుమార్, హరియాదవ్, రాము,కిషోర్, అనిల్ ఏ.రమేష్, దుర్గా,సునీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

డస్ట్‌బిన్స్.. దోమల ఉత్పత్తి కేంద్రాలు


• కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం
• వ్యాధుల బారిన ప్రజలు


పాత కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న తుప్పుపట్టిన డస్ట్‌బిన్స్

నెల్లూరు (పొగతోట): దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కార్పొరేషన్ అధికారులు ప్రకటనలు చేస్తున్నారనే కానీ.. వాటిని అమలు చేయడంలో నత్తతో పోటీ పడుతున్నారు. తుప్పు పట్టిన డస్ట్‌బిన్స్ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. నిరుపయోగంగా ఉన్న డస్ట్‌బిన్స్‌ను వేలం వేసి విక్రయించాలని నిర్ణయం తీసుకుని నెల రోజులు దాటుతున్న ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. వర్షాలు కురవడంతో డస్ట్‌బిన్స్‌లో నీరు నిల్వ చేరి పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. నెల రోజుల కిందట వెంకటేశ్వరపురంలో ఒక మహిళ డెంగీ జ్వరంతో మృతి చెందింది. దీంతో అధికారులు, పాలకవర్గం హడావుడి చేశారు. వందల సంఖ్యలో ప్రజలు విష జ్వరాల బారిన పడటంతో అధికారులు, పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించింది. నగర మేయర్ అబ్దుల్‌అజీజ్ అధికారులతో సమావేశాలు నిర్వహించి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాత వస్తువులు, పాడైపోయినవి ఇంటి అవరణలో ఉంచవద్దని ప్రచారం చేశారు. ఇంటిలోనూ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలబడకుండా ప్రజలు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత టైర్లు, ట్యూబ్‌లు, రోళ్లు ఇతర పాత వస్తువులల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే డెంగీ వ్యాధి వచ్చేందుకు కారకమయ్యే దోమలను ఉత్పత్తి అవుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్పొరేషన్ అధికారులు బృందాలుగా విడిపోయి ఇళ్లలోని పాత వస్తువులను తొలగించారు. పాత కార్పొరేషన్ కార్యాలయం వద్ద తప్పుపట్టిన పనికిరాని డస్ట్‌బిన్స్ ఉన్నాయని మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. పాత కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న తప్పుపట్టిన డస్ట్‌బిన్స్‌ను వేలం వేయమని నగర మేయర్ ఆదేశించి నెల రోజులు దాటుతుంది. ఇంత వరకు అమలు చేయలేదు. తుప్పుపట్టిన డస్ట్‌బిన్స్ అధికంగా ఉన్నాయి. వర్షపునీరు డస్ట్‌బిన్స్‌లో నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. డస్ట్‌బిన్స్‌ను వేలం వేస్తే కార్పొరేషన్‌కు ఆదాయం చేకురుతుంది దోమల నివారణ జరుగుతుంది.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం


గణనాథుడికి హారతి ఇస్తున్న మహిళలు


సర్వేపల్లి కాలువులో నిమజ్జనం..

నెల్లూరు (బృందావనం): నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల నిమజ్జనం ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు, భక్తులు రంగులు చల్లుకుంటూ డప్పులు, బాణ సంచా సందడి నడుమ నిమజ్జన ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి. విక్రమసింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ అబ్దుల్‌అజీజ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్, సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి మెంటా రామమోహన్‌రావు, బయ్యావాసు, మారు బోయిన శ్రీనివాసులు, మండ్ల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

భక్తుల్లో సర్వత్రా నిరసన

గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా పెన్నానదిలో, జాఫర్ సాహెబ్ కాలువలో తగిన మేర నీరు లేకపోవడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేశారు. గణేష్ నిమజ్జనోత్సవం ఉన్నప్పటికీ తగిన మేర తల్పగిరి రంగనాథస్వామి ఆలయం వద్ద నీటిని ఉంచాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నీటి వనరులపై దృష్టి సారించలేదు. పవిత్ర పూజలందుకున్న విగ్రహాల నిమజ్జనోత్సవానికి అవసరమైన మేర నీరు లేక పోవడం పట్ల ప్రభుత్వ తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెన్నాబ్యారేజీ, తల్పగిరి రంగనాథస్వామి ఆలయం వద్ద తగిన నీటిసౌకర్యం కల్పించలేదు. పవిత్రంగా పూజలందుకున్న బొజ్జగణపయ్యలు అంతంత మాత్రం నీటిలోనే నిమజ్జనం చేస్తున్నారు. నీటి ప్రవాహం సరిలేక మురుగునీరుగా మారింది. తొలిరోజే ఒక విగ్రహంపై మరో విగ్రహం పడిపోతూ నిమజ్జనం కాకపోవడం చూసి భక్తుల మనస్సులు నొచ్చుకుంటున్నాయి.

తరలిన కాపువీధి గణేష్ విగ్రహం

కాపువీధి మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 21 అడుగుల భారీ గణేష్ విగ్రహం ఆదివారం రాత్రి 10 గంటలకు నిమజ్జనోత్సవానికి కదిలింది. భారీ విగ్రహ నిమజ్జనోత్సవం సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాలకు మాజీ మంత్రి ఆనంరామనారాయణరెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి హాజరయ్యారు.

బూత్‌లెవల్ కమిటీలతో పార్టీ బలోపేతం

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర

నెల్లూరు రూరల్ : ప్రతి డివిజన్, గ్రామంలో బూత్ లెవల్ కమిటీలను ఏర్పాటు చేసి, ఆ కమిటీల ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర నాయకులకు సూచించారు. మినీబైపాస్ రోడ్డులోని మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం టీడీపీ నేతల సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ ప్రతి ఎన్నికల బూత్ పరిధిలో బూత్ లెవల్ కమిటీల ఏర్పాటు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కమిటీలు ఓటర్ల చేర్పింపు, తొలగింపుపై దృష్టి పెట్టి పని చేయాలన్నారు. త్వరలో ప్రారంభించనున్న ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సమస్యలపై కార్యకర్తలు పని చేయాలన్నారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలకు ఒరిగే ప్రయోజనాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు ఆనం జయకుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి హరిబాబుయాదవ్, డీసీసీబీ డైరెక్టర్ కోడూరు కమలాకర్‌రెడ్డి, నుడా డైరెక్టర్ ఖాజావలి, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు స్వర్ణా వెంకయ్య, కార్పొరేటర్లు రాజేష్, సత్యనాగేశ్వరరావు, మేకల రజిని, శైలజ, రూరల్ మండల నాయకులు వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, రాంగోపాల్ పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

నెల్లూరు (బృందావనం) : సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా గాంధీబొమ్మ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద రాఘవ నాయుడు చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆహారపొట్లాల పంపిణీ చేశారు. నిరుపేదలు, అనాథలు, కుష్టువ్యాధిగ్రస్తులకు ఆహార పొట్లాలు పంపిణీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన నిర్వాహకులు గాలి కిరణ్‌కుమార్, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, రాయప్ప, నారాయణ, దినకర్ రాంబాబు, కేశవ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతిని కలిసిన బీజేపీ నేత సురేంద్రరెడ్డి


వెంకయ్యనాయుడిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, శేఖర్‌రాజు

నెల్లూరు (బారకాసు) : భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుని ఆదివారం విజయవాడలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతికి సురేంద్రరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి వినాయకచవితి శుభాకాంక్షలు తెలియజేశారు. సురేంద్రరెడ్డి వెంట ఆ పార్టీ సీనియర్ నేత శేఖర్‌రాజు ఉన్నారు.

సాక్షి
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు | సోమవారం | ఆగస్టు | 28 | 2017

Portal Updates:
www.sakshieducation.com
→ IBPS PO & RRBs Officers Material and Online Practice Tests
→ IB ACIO Success tips, Material, Solved Papers & Online Tests
→ UPSC: CDS Exam (II) 2016 Final Result Released

విద్య
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

Sakshi Vidya Online Edition www.sakshieducation.com/Vidya.aspx
Send your Feedback to..sakshieducation@gmail.com

భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న భారతదేశ దీవి?



ముల్కల రమేష్
సబ్జెక్టు నిపుణులు

జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. న్యూమూర్ దీవులు ఏ ప్రాంతంలో ఉన్నాయి?
1) మన్నార్ సింధుశాఖ
2) చిలకా సరస్సు
3) గంగా-బ్రహ్మపుత్ర డెల్టా
4) గోదావరి డెల్టా

2. దీవులు, అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) పిరం దీవులు – కథియవార్ తీరం
2) నొరా దీవులు – కచ్ తీరం
3) ఆలియా బెట్ దీవులు – నర్మద, తపతి ముఖద్వారం
4) ఎలిఫెంటా – కొచ్చిన్ తీరం

3. 'బాలాసోర్' దీవి ఏ ప్రాంతంలో ఉంది?
1) చిలక సరస్సు 2) కొల్లేరు సరస్సు
3) పులికాట్ సరస్సు
4) మన్నార్ సింధుశాఖ

4. దీవులు, అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
i) వైఫిన్ a) మన్నార్ సింధుశాఖ
ii) సాగర్ b) కథియవార్ తీరం
iii) పాంబన్ c) కొచ్చిన్ తీరం
iv) బైసోలా d) గంగాడెల్టా
1) i-b, ii-c, iii-d, iv-a
2) i-c, ii-d, iii-a, iv-b
3) i-b, ii-d, iii-a, iv-c
4) i-c, ii-a, iii-d, iv-b

5. 'అబ్దుల్ కలాం దీవి' ఏ రాష్ట్రంలో ఉంది?
1) తమిళనాడు 2) కేరళ
3) గుజరాత్ 4) ఒడిశా

6. 'కరంజ' దీవి ఏ రాష్ట్రంలో ఉంది?
1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
3) మహారాష్ట్ర 4) కర్ణాటక

7. కింది వాటిలో సరికానిది ఏది?
1) వైదా, డయ్యు దీవులు కచ్ తీరంలో ఉన్నాయి
2) సాల్‌సెట్టి దీవులు కథియవార్ తీరంలో ఉన్నాయి
3) సాగర్ దీవులు పశ్చిమ బెంగాల్‌లో ఉన్నాయి
4) క్రొకొడైల్ దీవులు మన్నార్ సింధు శాఖలో ఉన్నాయి

8. 8° చానల్ ఏ దీవి ద్వారా వెళుతోంది?
1) మినికాయ్ దీవి 2) సుహేలి దీవి
3) న్యూమూర్ దీవి 4) పాంబన్ దీవి

9. కింది వాటిలో సరికానిది ఏది?
1) 'డంకన్ పాసేజ్' అనేది దక్షిణ అండమాన్, లిటిల్ అండమాన్ దీవుల మధ్య ఉంది
2) సుహేలి దీవికి, మినికాయ్ దీవులకు మధ్య 9° చానల్ ఉంది
3) కోకో దీవికి, అండమాన్ దీవులకు మధ్య 'కోకో చానల్' ఉంది
4) అమీన్ దీవులు గుజరాత్ రాష్ట్రంలో ఉన్నాయి

10. 'మాజులీ' దీవి ఏ నది మూలంగా ఏర్పడింది?
1) గంగా 2) కృష్ణా
3) సింధూ 4) బ్రహ్మపుత్ర

11. 'గల్ఫ్ ఆఫ్ మన్నార్' ఎక్కడ ఉంది?
1) గుజరాత్‌కు పశ్చిమం వైపు
2) తమిళనాడుకు తూర్పు వైపు
3) పశ్చిమబెంగాల్‌కు ఉత్తరం వైపు
4) ముంబైకి దక్షిణం వైపు

12. మినికాయ్, మాల్దీవులను వేరు చేసే జల మార్గం ఏది?
1) 9° జలమార్గం 2) 8° జలమార్గం
3) కోకోస్ జలమార్గం
4) సెయింట్ జార్జెస్ జలమార్గం

13. మినికాయ్ దీవి ఏ ప్రాంతంలో ఉంది?
1) అండమాన్ 2) నికోబార్
3) లక్షదీవులు 4) మన్నార్ సింధుశాఖ

14. కింది వాటిలో భారత్, శ్రీలంక మధ్య ఉన్న ద్వీపాలు ఏవి?
1) ఎలిఫెంటా 2) నికోబార్
3) రామేశ్వరం 4) సాల్సెట్టి

15. కింది వాటిలో సరైంది ఏది?
1) లక్షదీవులు 'ప్రవాళ భిత్తిక'లతో ఏర్పడ్డాయి
2) లక్షదీవుల మొత్తం విస్తీర్ణం 32 చ.కి.మీ.
3) లక్షదీవుల్లో అతి పెద్ద దీవి 'కవ్రల్' దీవి
4) లక్షదీవుల్లో జనాభా లేని దీవి – పిట్లీ

16. పాంబన్ దీవి ఏ రెండు దేశాల మధ్య ఉంది?
1) భారత్, పాకిస్తాన్
2) భారత్, శ్రీలంక 3) భారత్, బంగ్లాదేశ్
4) భారత్, మయన్మార్

17. 'కపిలధార' జలపాతం ఏ నదిపై ఉంది?
1) నర్మద 2) తపతి
3) కృష్ణా 4) ఇంద్రావతి

18. దేశంలోని జలపాతాలు, అవి ఉన్న నదులకు సంబంధించి కింది వాటిలో సరికానిది?
1) పైకారా జలపాతం – కావేరి నది
2) కుంతాల జలపాతం – కడెం నది
3) దుదుమా జలపాతం – వంశధార నది
4) చిత్రకూట్ జలపాతం – ఇంద్రావతి నది

19. ధువన్‌ధార జలపాతం ఏ నదిపై ఉంది?
1) మహానది 2) కావేరి
3) కృష్ణా 4) నర్మద

20. జలపాతాలు, అవి ఉన్న నదులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
జలపాతం నదులు
i) జోగ్ a) సువర్ణరేఖ
ii) యెన్నా b) కావేరి
iii) శివసముద్రం c) కృష్ణా
iv) హుండ్రు d) శరావతి
1) i-d, ii-a, iii-b, iv-c
2) i-d, ii-c, iii-b, iv-a
3) i-d, ii-b, iii-a, iv-c
4) i-b, ii-a, iii-d, iv-c

21. హుండ్రు జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
1) మధ్యప్రదేశ్ 2) బిహార్
3) జార్ఖండ్ 4) కర్ణాటక

22. జలపాతాలు, అవి ఉన్న రాష్ట్రాలకు సంబంధించి సరికానిది ఏది?
1) ధువన్‌ధార – మధ్యప్రదేశ్
2) శివసముద్రం – పశ్చిమ బెంగాల్
3) జొరసొప్పా – కర్ణాటక
4) చిత్రకూట్ – ఛత్తీస్‌గఢ్

23. 'తలకోన' జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
1) తెలంగాణ 2) ఆంధ్రప్రదేశ్
3) కర్ణాటక 4) మహారాష్ట్ర



24. కపిలధార జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
1) పశ్చిమ బెంగాల్
2) హిమాచల్‌ప్రదేశ్ 3) మధ్యప్రదేశ్
4) కర్ణాటక

25. 'గహిర్మాత' బీచ్ ఏ రాష్ట్రంలో ఉంది?
1) పశ్చిమ బెంగాల్ 2) ఒడిశా
3) మహారాష్ట్ర 4) కేరళ

26. కింది వాటిలో సరికానిది ఏది?
1) మెరీనా బీచ్ – తమిళనాడు
2) మైపాడు బీచ్ – ఆంధ్రప్రదేశ్
3) కోవలం బీచ్ – మహారాష్ట్ర
4) గంగాసాగర్ బీచ్ – పశ్చిమ బెంగాల్

27. దేశంలోని బీచ్‌లు, అవి ఉన్న రాష్ట్రాలను జతపరచండి.
i) అర్జున a) కేరళ
ii) చెరాయ్ b) గోవా
iii) శంకరపూర్ c) గుజరాత్
iv) గోపీనాథ్ d) పశ్చిమ బెంగాల్
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-d, ii-a, iii-b, iv-c
3) i-c, ii-a, iii-d, iv-b
4) i-b, ii-a, iii-d, iv-c

28. దిగా బీచ్ ఏ రాష్ట్రంలో ఉంది?
1) తమిళనాడు 2) గోవా
3) పశ్చిమ బెంగాల్ 4) కర్ణాటక

29. 'జుహు' బీచ్ ఏ రాష్ట్రానికి చెందింది?
1) మహారాష్ట్ర 2) గుజరాత్
3) ఒడిశా 4) పశ్చిమ బెంగాల్

30. 'బారెన్' అగ్ని పర్వతం ఎక్కడ ఉంది?
1) అండమాన్ దీవులు
2) నికోబార్ దీవులు
3) లక్షదీవులు 4) మాల్దీవులు

31. 'రాస్' దీవి ఎక్కడ ఉంది?
1) గంగా డెల్టా 2) లక్షదీవులు
3) అండమాన్ దీవులు
4) ముంబైకి దక్షిణంగా

32. 'వీలర్ ఐలాండ్' ఏ రాష్ట్రానికి చెందింది?
1) తమిళనాడు 2) కేరళ
3) ఒడిశా 4) పశ్చిమ బెంగాల్

33. కింది వాటిలో ఏ దీవులను మొదటిసారిగా సూర్యకిరణాలు తాకుతాయి?
1) సుహేలి దీవులు 2) మినికాయ్ దీవి
3) కమోటా దీవి 4) కవ్రల్ దీవులు

34. మహారాష్ట్రలోని తీర ప్రాంతాన్ని ఏమని పిలుస్తారు?
1) కొంకణ్‌తీరం 2) కెనరాతీరం
3) మలబార్ తీరం
4) కోరమాండల్ తీరం

35. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కెనరాతీరం – కర్ణాటక
2) మలబార్ తీరం – కేరళ
3) ఉత్కల్‌తీరం – పశ్చిమ బెంగాల్
4) సర్కార్‌తీరం – ఆంధ్రప్రదేశ్

36. 'వంగ తీరం' అని ఏ రాష్ట్ర తీర ప్రాంతాన్ని పిలుస్తారు?
1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
3) గోవా 4) తమిళనాడు

37. తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్ తర్వాత అత్యధిక తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
1) పశ్చిమ బెంగాల్ 2) ఒడిశా
3) తమిళనాడు 4) పుదుచ్చేరి

38. కింది వాటిలో సరైన జత ఏది?
1) కళింగ తీరం – ఒడిశా
2) కోరమాండల్ తీరం – తమిళనాడు
3) రాణా ఆఫ్ కచ్ తీరం – గుజరాత్
4) పైవన్నీ సరైనవే

39. 'ఉత్కళ్' తీర మైదానం అని ఏ రాష్ట్ర తీరాన్ని పిలుస్తారు?
1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
3) ఆంధ్రప్రదేశ్ 4) తమిళనాడు

40. దేశంలో ఎన్ని రాష్ట్రాలు తీర ప్రాంతాన్ని కలిగి ఉన్నాయి?
1) 8 2) 9 3) 10 4) 11

41. దేశంలో అత్యధిక తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
1) ఆంధ్రప్రదేశ్ 2) తమిళనాడు
3) మహారాష్ట్ర 4) గుజరాత్

42. దేశంలో అతి తక్కువ తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
1) కర్ణాటక 2) కేరళ
3) గోవా 4) పశ్చిమ బెంగాల్

43. మనదేశంలో 'లాగూన్'లు అత్యధికంగా ఉన్న రాష్ట్రం ఏది?
1) గుజరాత్ 2) మహారాష్ట్ర
3) పశ్చిమ బెంగాల్ 4) కేరళ

44. 'ఆలివ్ రిడ్లే' తాబేళ్లకు ప్రసిద్ధి చెందిన చిలక సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
1) ఒడిశా 2) తమిళనాడు
3) కేరళ 4) గోవా

45. 'సరస్సుల నగరం' అని దేన్ని పిలుస్తారు?
1) శ్రీనగర్ 2) ఉదయ్‌పూర్
3) జైపూర్ 4) అజ్మీర్

46. భారతదేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
1) సాంబర్ 2) దాల్
3) లూనార్ 4) ఊలార్

47. భారత్‌లో అతి పొడవైన ఉప్పునీటి సరస్సు ఏది?
1) సాంబార్ 2) చిలకా
3) పులికాట్ 4) పుష్కర్

48. లక్షదీవుల్లో దక్షిణంగా ఉన్న దీవి?
1) రాస్ 2) సుహేళి
3) పిట్లీ 4) మినికాయ్

49. న్యూమూర్ దీవులు ఏ రెండు దేశాల మధ్య వివాదస్పదమైనవి?
1) భారత్, మయన్మార్
2) భారత్, మాల్దీవులు
3) భారత్, బంగ్లాదేశ్
4) భారత్, శ్రీలంక

50. భారతదేశ ప్రాదేశిక జలాల పరిధి ఎంత?
1) 12 నాటికల్ మైళ్లు
2) 120 నాటికల్ మైళ్లు
3) 200 నాటికల్ మైళ్లు 4) 12 కి.మీ.

51. భారతదేశ దక్షిణాగ్ర ప్రాంతమైన 'పిగ్మేలియన్ పాయింట్' లేదా 'ఇందిరా పాయింట్' ఎక్కడ ఉంది?
1) ఉత్తర అండమాన్ దీవులు
2) లిటిల్ అండమాన్ దీవులు
3) గ్రేట్ నికోబార్ దీవులు
4) లక్షదీవులు

52. అండమాన్ నికోబార్ దీవుల రాజధాని 'పోర్టు బ్లెయిర్' ఏ ప్రాంతంలో ఉంది?
1) ఉత్తర అండమాన్
2) మధ్య అండమాన్
3) దక్షిణ అండమాన్
4) కార్ నికోబార్

53. భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న భారతదేశ దీవి ఏది?
1) గ్రేట్ నికోబార్ 2) కార్ నికోబార్
3) దక్షిణ అండమాన్
4) మధ్య అండమాన్

54. 'నార్కొండం' అగ్ని పర్వతం ఎక్కడ ఉంది?
1) మినికాయ్ దీవులు 2) లక్షదీవులు
3) ఉత్తర అండమాన్ 4) గ్రేట్ నికోబార్

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 2	5) 4
6) 3	7) 2	8) 1	9) 4	10) 4
11) 2	12) 2	13) 3	14) 3	15) 3
16) 2	17) 1	18) 3	19) 4	20) 2
21) 3	22) 2	23) 2	24) 3	25) 2
26) 3	27) 4	28) 3	29) 1	30) 1
31) 3	32) 3	33) 4	34) 1	35) 3
36) 2	37) 3	38) 4	39) 1	40) 2
41) 4	42) 3	43) 4	44) 1	45) 2
46) 4	47) 2	48) 4	49) 3	50) 1
51) 3	52) 3	53) 1	54) 3	

What price should the dealer..



N. Vinaykumar Reddy
Director, IACE,
Hyderabad.

Model Questions

Directions (Q.No.1-5): Data related to the number of visitors in two museums (A&B) during 4 day's.

Days	Museum A		Museum B	
	Number of visitors (male+female)	% of male visitors out of the number of visitors	Number of visitors (male+ female)	% of male visitors out of the number of visitors
Monday	190	30%	480	40%
Tuesday	280	40%	188	50%
Wednesday	350	60%	200	60%
Thursday	400	35%	120	75%

1. In Museum A, on Wednesday 30% of male visitors and 70% of female visitors were from school X. What was the number of visitors (male + female) in Museum A from school X on Wednesday?
a) 161 b) 183 c) 181
d) 153 e) 157

2. The number of visitors (male + female) in Museum A and B increased by 50% and 15% respectively from Thursday to Saturday. If the total number of female visitors in Museum A and B together was equal on Thursday and Saturday, what was the total number of male visitors in Museum A and B together on Saturday?
a) 458 b) 438 c) 442
d) 448 e) 452

3. In Museum B, the ratio of female visitors on Tuesday to Friday was 2:3. If female visitors constituted 50% of the number of visitors (male+female) on Friday, what was the number of visitors (male + female) to Museum B on Friday?
a) 288 b) 296 c) 294
d) 282 e) 276

4. In Museum A, what is the difference between the total number of male visitors on Monday and Tuesday together and that on Wednesday and Thursday together?
a) 183
b) 177
c) 185
d) 187
e) 181

5. What is the average number of male visitors in Museum B on Monday, Wednesday and Thursday?
a) 134 b) 188 c) 185
d) 175 e) 184

Directions (Q.No. 6-10): In each of the following questions two equations I and II are given. You have to solve both the equations and Give answer.
a) If $x > y$ b) If $x \leq y$
c) If $x < y$ d) If $x \geq y$
e) $x = y$ or relationship between x and y cannot be established

6. I. $14x^2 + 29x - 18 = 0$
II. $8y^2 - 25y - 28 = 0$

7. I. $6x^2 + 23x - 35 = 0$
II. $7y^2 - 9y - 46 = 0$

8. I. $x^2 = 6889$
$y = \sqrt{7142 - 253}$




9. I. $6x - 11y = 132$
II. $8x + 9y = 34$


10. I. $6x^2 - 21x + 18 = 0$
II. $7y^2 - 46y - 21 = 0$

Directions (Q.No. 11 - 15): Study the following pie-charts carefully to answer the questions.

The following pie-charts show the regional distribution of aid from DAC member.



Year 2011



Year 2016

11. If the total aid received by all the countries in 2011 and 2016 was Rs. 740 billion and Rs. 1150 billion respectively, then which group of region show the maximum difference between 2016 and 2011?
a) South and Central Asia
b) Unspecified c) Europe
d) South of Sahara
e) Latin America and Caribbean

12. The aids received by South and Central Asia in 2011 and by South of Sahara in 2016 are Rs. 192.4 billion and Rs. 552 billion respectively. What is the difference between the total aid received by them in 2016 and that in 2011? (in Rs. billion)
a) 780 b) 820
c) 815 d) 860
e) 845

13. If Europe gets Rs. 74 billion aid in 2011, then the amount of aid received by South and Central Asia and East Asia and Pacific together is how much percentage less than that by South of Sahara and Middle East and North Africa together in the same year?
a) 31.12% b) 39.82%
c) 24.28% d) 34.28%
e) 36.78%

14. If the ratio of aids received by Unspecified region in 2011 to that in 2016 is 22 : 23 and the Unspecified regions get Rs. 264.5 billion in 2016 then what is the ratio of the aids received by Latin America and Caribbean in 2011 to that in 2016?
a) 1687 : 4025 b) 1683 : 4031
c) 4031 : 1683 d) 4025 : 1686
e) None of these

15. If Middle East and North Africa get Rs. 148 billion in 2011, then the aids received by Unspecified regions is what percent more than that received by South of Sahara?
a) 33.33% b) 23.33%
c) 16.66% d) 24.68%
e) None of these

Directions (Q.No.16-20): What value should come in place of question mark (?) in the following questions?

16. $8.6 \times 4.5 \times 30.2 = ?$
a) 1168.74 b) 1248.24
c) 1186.74 d) 1824.14
e) None of these

17. $\frac{17}{9}$ of 1638 of $\frac{19}{7}$ of $\frac{27}{13} = ?$
a) 12442 b) 18462
c) 19628 d) 17442
e) None of these

18. $25897 - 2434 + 3246 - 2642 = 7456 + ?$
a) 26421 b) 15211
c) 16611 d) 14211
e) None of these

19. $23^{2.3} \times 23^{2.6} \times 23^{475.2} = 23^{345 + ?}$
a) 126.1 b) 135.1
c) 145.1 d) 129.1
e) None of these

20. $7\frac{2}{3} + 8\frac{7}{9} + 2\frac{8}{9} + 4\frac{7}{12} = ?$
a) $39\frac{5}{12}$ b) $26\frac{7}{12}$ c) $23\frac{11}{12}$
d) $40\frac{7}{12}$ e) None of these

Key & Solutions

1. Number of (male + female) visitors in Museum A from School X on Wednesday
$= 350\times\frac{60}{100}\times\frac{30}{100}+350\times\frac{40}{100}\times\frac{70}{100}$
= 63 + 98 = 161 ***Ans: a***

2. Total number of visitors in Museum A on Saturday
$= 400\times\frac{150}{100} = 600$
Total number of visitors in Museum B on Saturday
$= 120\times\frac{115}{100} = 138$
Now, total number of female visitors in Museum A and B together on Thursday
$= \left(400\times\frac{65}{100}+120\times\frac{25}{100}\right) = 290$
∴Total number of male visitors in Museum A and B together on Saturday = (600 + 138) – 290
= 738 – 290 = 448 ***Ans: d***

3. Number of female visitors on Friday in Museum B = 50% of
$188\times\frac{3}{2} = \frac{1}{2}\times188\times\frac{3}{2} = 47\times3 = 141$
Number of (male + female) visitors in Museum B on Friday
∴50% ⇒ 141
∴100% ⇒141×2=282 ***Ans: d***

4. Required difference = (60% of 350 + 35% of 400) – (30% of 190 + 40% of 280) = (210 + 140) – (57 + 112) = 181 ***Ans: e***

5. Required average
$= \frac{40\%\text{ of }480+60\%\text{ of }200+75\%\text{ of }120}{3}$
$= \frac{192+120+90}{3} = \frac{402}{3} = 134$
Ans: a

6. $14x^2 - 7x + 36x - 18 = 0$
$(2x-1)(7x + 18) = 0$
$x = \frac{1}{2}, \frac{-18}{7}$
$8y^2+32y-7y-28 = 0$
$(y + 4)(8y-7) = 0$
$y = -4, \frac{7}{8}$
Hence relation cannot be established ***Ans: e***

7. $6x^2 + 30x - 7x - 35 = 0$
$(x + 5)(6x - 7) = 0$
$x = -5, \frac{7}{6}$
$7y^2 + 14y - 23y - 46 = 0$
$(y + 2)(7y - 23) = 0$
$y = -2, \frac{23}{7}$
Hence, relation cannot be established ***Ans: e***

8. I. $x^2 = 6889$
∴ $x = \sqrt{6889} = \pm 83$
II. $y = \sqrt{7142 - 253} = \sqrt{6889} = 83$
Hence $x \leq y$ ***Ans: b***

9. I. $6x - 11y = 132$ —— (i)
II. $8x + 9y = 34$ ——— (ii)
Equation (i) × 4 – (ii) × 3 gives
$24x - 44y = 528$
$24x + 27y = 102$
$-71y = 426$ ∴ $y = -6$
Putting the value of y in equation (i), we get $x = 11$
Hence, $x > y$. ***Ans: a***

10. I. $2x^2 - 4x - 3x + 6 = 0$
$(x - 2)(2x - 3) = 0$
$x = 2, \frac{3}{2}$
$7y^2 - 49y + 3y - 21 = 0$
$(y - 7)(7y + 3) = 0$
$y = 7, \frac{-3}{7}$
Hence, relation can't be established ***Ans: e***

11.

Country	2016	2011	Difference
Latin America & caribbean	11.50× 14 = 161	7.4× 8 = 59.2	101.8
Middle East & North Africa	11.50 × 8 = 92	7.4×10 =74	18
Europe	11.50 × 10 = 115	7.4 × 4 =29.6	85.4
Unspecified	11.50 × 23 =264.5	7.4 × 30 =222	42.5
South of Sahara	11.50 × 24 = 276	7.4 × 25 =185	91
South and Central Asia	11.50 × 15 = 172.5	7.4 × 13 96.2	76.3

Hence the maximum difference is Rs. 101.8 billion ***Ans: e***

12. Required difference
$= \frac{552}{24}\times100 - \frac{192.4}{13}\times100 = \text{Rs. }820$
Ans: b

13. Required % =
$= \frac{(25+10)-(13+10)}{(25+10)}\times100$
$= \frac{35-23}{35}\times100 = 34.28\%$
Ans: d

14. The aids received by Unspecified region in 2011 = Rs. 253 billion
Required Ratio
$= \frac{\frac{253}{30}\times8}{\frac{264.5}{23}\times14} \Rightarrow \frac{67.47}{161}$
$\Rightarrow \frac{1686.75}{4025} \Rightarrow \frac{1687}{4025}$ ***Ans: a***

15. Req.% $= \frac{30-25}{25}\times100 = 20\%$ ***Ans: e***

16. 8.6 × 4.5 × 30.2 = 1168.74
Ans: a

17. $\frac{17}{9}\times1638\times\frac{19}{7}\times\frac{27}{13} = 17442$ ***Ans: d***

18. 25897 – 2434 + 3246 – 2642 = 7456 + ? Or, ? = 24067 – 7456 = 16611 ***Ans: c***

19. 345 + ? = 2.3 + 2.6 + 475.2
? = 135.1 ***Ans: b***

20. $? = (7+8+2+4)\left(\frac{2}{3}+\frac{7}{9}+\frac{8}{9}+\frac{7}{12}\right)$
$= 21 + \left(\frac{24+28+32+21}{36}\right) = 23\frac{11}{12}$
Ans: c

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి



కనుక్కోండి

కింద ఉన్న బొమ్మల్లో రెండు బొమ్మలు ఒకేలా ఉన్నాయి. అవేమిటో కనుక్కోండి.



మీకు తెలుసా?



జింకలు పుట్టిన అరగంటకే నడుస్తాయి



డైనోసార్లు భూమ్మీద 150 మిలియన్ సంవత్సరాలు బతికాయి

నాన్నా చెప్పవా?

ఎక్స్‌రే టెలిస్కోపులు దేనికోసం ఉపయోగిస్తారు


కాంతితాలూకు విభిన్న రూపాలలో కేవలం మన కంటికి కనిపించే కాంతి మాత్రమేగాక రేడియో తరంగాలు, సూక్ష్మతరంగాలు, పరారుణ కాంతి, అతినీలలోహిత కాంతి, ఎక్స్-కిరణాల కాంతి, గామా కిరణాల కాంతి ఉన్నాయి. విశ్వంలోని వివిధ ఖగోళ పదార్థాల ధర్మాలను, వాటి ఉష్ణోగ్రతలనుబట్టి వేర్వేరు రకాలకు చెందిన కాంతి వాటి నుంచి ఉద్గారమవుతుంది. ఉదాహరణకు సున్నా డిగ్రీ సెల్సియస్ కన్నా కొన్ని వందల డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతతో ఉండే వస్తువుల నుంచి చాలా తక్కువ శక్తితో కూడిన రేడియో, ఇంకా



మైక్రోవేవ్ కాంతి కణాలు విడుదలవుతుంటాయి. సున్నా డిగ్రీ కన్నా ఎగువన కొన్ని వందల డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉండే వస్తువులనుంచి ఎక్కువగా పరారుణ కాంతి విడుదలవుతుంటుంది. లక్షలాది డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉండే ఖగోళ రాశుల నుంచి వెలువడే శక్తి ప్రధానంగా ఎక్స్-రే కిరణాల వంటి వాటి రూపంలో ఉంటుంది. ఉదాహరణకు నక్షత్ర మండలాల్లో చోటుచేసుకునే భారీ విస్ఫోటనాలు, తీవ్రంగా ఉండే అయస్కాంత క్షేత్రాలు, అతి శక్తివంతమైన గురుత్వాకర్షణ క్షేత్రాలు, న్యూట్రాన్ తారలు, కృష్ణబిలాలు (బ్లాక్ హోల్స్) ఎక్స్-రే కిరణాల వంటి శక్తినే ఎక్కువగా విడుదల చేస్తుంటాయి. అయితే ఈ తరహా కాంతిని మనం మామూలు టెలిస్కోపులతో గ్రహించి, విశ్లేషించడానికి వీలు కాదు. మనకంటికి కనపించే కాంతి దర్పణాలపై పడినప్పుడు పరావర్తనం చెందితే, ఎక్స్-రే కిరణాలు మాత్రం అందులోంచి చొచ్చుకుని ముందుకు సాగిపోతాయి. అందుకని విశ్వంలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఎక్స్ కిరణాలను సేకరించి, ఆయా ఖగోళ పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనేందుకు మామూలు టెలిస్కోపులకు బదులుగా ప్రత్యేకంగా రూపొందించే ఎక్స్-రే టెలిస్కోపులను ఉపయోగిస్తారు.

దారి కనుక్కోండి

మధ్యలో ఉన్న తాళంచెవితో ఒక డోర్ ఓపెన్ చేసుకుని బయటికి వచ్చే మార్గం కనుక్కోండి. తాళంచెవితో ఒక డోర్ మాత్రమే ఓపెన్ అవుతుంది.



గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి


mango
onion
ladder
bamboo
peanut
lolipop
compost
apricot




e	u	t	u	n	a	e	p	l
e	e	f	e	z	i	t	r	o
t	j	p	s	j	u	o	e	l
s	r	o	t	s	g	c	d	i
o	k	n	s	j	w	i	d	p
p	a	i	z	o	e	r	a	o
m	w	o	b	f	s	p	l	p
o	e	n	o	g	n	a	m	v
c	c	b	a	m	b	o	o	o

నీడను గుర్తించండి


కింద ఇచ్చిన 5 నీడల్లో పైన ఉన్న డైనోసార్ అసలైన నీడ ఏదో గుర్తించండి



కింద ఇచ్చిన చేప బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి





'ఓనం' సంబరం

నెల్లూరు (బృందావనం) : మలయాళీల పండగ 'ఓనం'ను నగరంలో ఆదివారం కోలాహలంగా జరుపుకున్నారు. మళయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మళయాళీలు నెల్లూరుకు చేరుకున్నారు. తమ సంప్రదాయ దుస్తులతో ఓనం ఉత్సవాలతో నగరంలోని పురమందిరంలో సందడి చేశారు. అసురరాజు మహాబలిచక్రవర్తి పునరాగమనాన్ని పురస్కరించుకుని మళయాళీలు ఓనం పండగను సంప్రదాయంగా నిర్వహించారు. మహాబలిచక్రవర్తి రాక్షస రాజు అయినప్పటికీ ఆయన కేరళను పరిపాలించిన సమయంలో దేశంలో ప్రజలు సుఖసంతోషాలు, సంబరాలతో జీవించారన్నారు. అయితే మహావిష్ణువు వామన రూపంలో మహాబలి చక్రవర్తిని అంతమొందించారన్నారు. అయితే మహావిష్ణువును మహాబలిచక్రవర్తి ఏడాదిలో ఒకరోజు తన ప్రజలను చూసేందుకు అవకాశం కల్పించాలని కోరుకున్నారన్నారు. ఆయన రాకతో గత ఆనందోత్సాహాల రోజులను మననం చేసుకుంటూ మహాబలిచక్రవర్తిని స్వాగతిస్తూ 'ఓనం' పండగను కేరళీయులు జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోందని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ 'తిరువాకర', ఇస్లాం సంప్రదాయాన్ని పాటిస్తూ 'ఒప్పన', క్రైస్తవ ఆచార వ్యవహారాలకు గుర్తుగా 'మార్గంగళి' నృత్యాలను ప్రదర్శించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను వివరించే నృత్య ప్రదర్శనలు జరిగాయి.

సంప్రదాయ నృత్యాలతో అలరించిన మలయాళీ యువతలు





మళయాళీలు మంచికి ప్రతిరూపాలు

- నా సినీజీవితానికి పునాదులు నెల్లూరీయులు
- సినీనటుడు సంపూర్ణేష్‌బాబు
- ఘనంగా 'ఓనం' పండగ ఉత్సవాలు

నెల్లూరు (బృందావనం) : మళయాళీలు మనసున్న మంచి మనుషులని, వారి మంచితనం, సహాయ గుణం తనను ఇంతవాణ్ణి చేసిందని, నా చలనచిత్ర జీవితానికి మట్టిలో పడి ఉన్న నన్ను మాణిక్యంలా మార్చింది నెల్లూరీయులని వారిని నా జీవితంలో ఎన్నడూ మరవలేనని సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు అన్నారు. మళయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరంలో ఆదివారం జరిగిన 'ఓనం సెలబ్రేషన్స్ 2017' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎక్కడో తెలంగాణ సిద్ధిపేట జిల్లాలోని మెట్టుపల్లిలో నిరుపేద కుటుంబంలో పుట్టానన్నారు. అలాంటి తనను ప్రముఖ నటుడు ఉపేంద్ర గెటప్‌లో చూసిన హృదయ కాలేయం డైరెక్టర్, నెల్లూరీయుడు, కథా రచయిత సాయిరాజేష్ (స్టీవెన్‌శంకర్) తనకు హృదయకాలేయంలో అవకాశం కల్పించారన్నారు. ఈ సమయంలో మళయాళీ అయిన సంతోష్ పాండ్యన్ తనకు పలు సూచనలు చేసి సహజంగా నటించాలని, తనకంటూ ఒక స్టైల్ చూపాలన్నారు. వీరి సహకారంతో తాను నటించిన 'హృదయకాలేయం'తో తనకు గుర్తింపు వచ్చిందన్నారు. ఎందరో మహానుభావులు పుట్టిన నెల్లూరు గడ్డపై తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఈ సంతోష సంబరాల్లో పాల్గొనే అవకాశం కల్పించడం ఎంతోసంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో మళయాళీలు ముందస్తుగా 'ఓనం' పండగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వచ్ఛతకు, నీతి, నియమాలకు, సేవా గుణానికి, స్నేహానికి మళయాళీలు ప్రతిరూపాలుగా కొనియాడారు. మళయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంకే నందకుమార్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఓనం పండగను జిల్లాలోని మళయాళీలందరూ ఐకమత్యంగా జరుపుకుంటున్నామన్నారు. ఆల్ ఇండియా మళయాళీ అసోసియేషన్ , ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు డేవిస్‌కొట్లి, తిరుపతి కైరళి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సౌభద్రన్ నాయర్, పీఏ చాచాప్పన్, ప్రకాశం జిల్లా మళయాళీ వెల్ఫేర్ అసోసియషన్ అధ్యక్షుడు వీఓ జాయ్, మళయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీఎస్ శివరామన్, కేరళ ఆయుర్వేద వైద్యశాల, నెల్లూరు చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ ఎన్. శ్రీవాత్సవకుమార్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మళయాళీలు నిర్వహించిన సంప్రదాయనృత్యాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న నటుడు సంపూర్ణేష్‌బాబు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వేదాయపాళెం) : సింహపురి భవిత ద్వారా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై ఏరియా ఆఫీసర్ల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింహపురి భవిత సభ్యత్వ కార్యదర్శి, సెట్నల్ సీఈఓ డాక్టర్ సి.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా ఆఫీసర్ల పోస్టులు నాలుగు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు హార్టికల్చర్ లేదా అగ్రికల్చర్‌లో డిప్లొమో, లేదా డిగ్రీ పాసై ఉండాలన్నారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుందన్నారు. వేతనం రూ.17,500, రవాణాభత్యం రూ.500 ఇస్తారని తెలిపారు. మార్కుల ప్రాతిపదికన ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు నగరంలోని ఏకే నగర్‌లో ఉన్న సెట్నల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 98499 09074 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.


స్వయం పోషిత బిల్లులను ఉపసంహరించాలి

నెల్లూరు (టౌన్) : స్వయం పోషిత పాఠశాలల బిల్లును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వయం పోషిత బిల్లు వల్ల కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాల్లో పనిచేసే ఉపాధ్యాయ, విద్యార్థులు హక్కులు పూర్తిగా హరించబడతాయన్నారు. తల్లిదండ్రులపై కూడా ఆర్థిక దోపిడీ విపరీతంగా పెరుగుతుందని, కార్పొరేట్ విద్యాసంస్థలు తమ వ్యాపారాన్ని రెట్టింపు చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలు జరిగాయని, కొన్ని స్థానాలను బ్లాక్ చేసి వారికి కావాల్సిన వారికి కేటాయించారని ఆరోపించారు. అక్రమం బదిలీలపై సమగ్ర విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. అధ్యక్షత వహించిన చిరంజీవి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం వచ్చే నెల 1న చేపట్టనున్న మిలినీయం మార్చ్‌కు ఏపీటీఎఫ్ మద్దతు తెలిపారు. పలు సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదిం చారు. ఉర్దూ పాఠశాల్లో ఉర్దూతో పాటు తెలుగు మీడియంను కొనసాగించాలన్నారు. డీఈఓ పూల్‌లో ఉన్న వారిని వెంటనే పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి, మోహన్‌దాస్, ఇమామ్, రమణయ్య, సుభాన్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిమజ్జన కోలాహలం




జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపతి బప్పా మోరియా నినాదాలు.. డప్పుమోతల హోరు, యువత కేరింతలు..విద్యుద్దీపాలంకరణలు..హోరెత్తించే సినీ నృత్యగీతాల నడుమ నగరంలో గణేష్ నిమజ్జనోత్సవం ఆదివారం కోలాహలంగా సాగింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గృహాలు, నగరంలోని పలు కూడళ్లు, వీధుల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను పూజల నడుమ పెన్నమ్మ ఒడికి తరలించారు. సంతపేటసెంటర్‌లో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గణనాథులు నిమజ్జనోత్సవానికి తరలివెళ్లారు. – నెల్లూరు(బృందావనం)





బంగారు గరుడవాహనంపై ఊరేగిన శ్రీవారు



కోన మాడవీధుల్లో ఊరేగుతున్న నృసింహుడు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బంగారు గరుడ వాహనంపై కోన మాడవీధుల్లో ఆదివారం ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మండపంలో స్వర్ణ గరుడవాహనంపై శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో వేదపండితుల మంత్రోచ్ఛారణలతో కోన తిరువీధుల్లో క్షేత్రోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

లడ్డూ @ రూ.2 లక్షలు



డక్కిలి: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలను ఆదివారం నిర్వాహకులు వేలం వేశారు. పలువురు అధిక మొత్తానికి లడ్డూను దక్కించుకున్నారు. డక్కిలి మండలం మాటుమడుగులో ఏర్పాటు చేసిన పది కిలోల లడ్డూకు ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో వేలం వేశారు. గ్రామానికి చెందిన పోలంరెడ్డి పెంచలరెడ్డి రూ.రెండు లక్షలకు దక్కించుకున్నారు.

రూ.1.83 లక్షలు పలికిన లడ్డూ

మండలంలోని దగ్గవోలులో గ్రామ చావిడి వద్ద తూర్పు వీధి వాసులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూను ఆదివారం వేలం వేశారు. గ్రామానికి చెందిన దూడల రవి, సంక్రాతి వెంకటాద్రి రూ.1.83 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు.

హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు



హైజంప్‌లో విద్యార్థిని



పరుగు పందెంలో ఉత్సాహంగా విద్యార్థులు

మర్రిపాడు:

మండలంలోని కృష్ణాపురంలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం రెండో రోజు అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎనిమిది క్లస్టర్ల నుంచి 73 నవోదయ విద్యాలయాలకు చెందిన 471 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు లాంగ్‌జంప్, హైజంప్, పరుగు పందెలను నిర్వహించారు. ఈ పోటీల్లో బళ్లారి విద్యాలయానికి చెం దిన వారు 91 పాయింట్లతో ప్రథమ స్థానంలో, పుదుచ్చేరికి చెందిన విద్యార్థులు 73 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. షిమోగాకు చెందిన వి ద్యార్థులు 69 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలి చారు. పోటీలను ప్రిన్సిపల్ రాజన్ పర్యవేక్షించారు.





కావ్యాంజలి, ముత్తుకూరు



మోనిత, గగన్, నెల్లూరు



సాయిరామ్, చెర్లోపల్లి



సాయికృష్ణ, చెర్లోపల్లి



వైభవ్ కార్తీక్, నెల్లూరు



భూమన శ్రీశైల, దండిగుంట, విడవలూరు



అచ్యుత్, అనిరుధ్, వెంకటేష్, చిన్నపడుగుపాడు



మనోహర్, యాకేష్, కొండాపురం



ఉమారాణి, శరణ్, పప్పులవీధి, నెల్లూరు




భారతి, ప్రధానోపాధ్యాయురాలు, రెడ్డిపాళెం ఎంపీపీ పాఠశాల, వాకాడు మండలం

సెల్ఫీ విత్ గణేశ

‘సాక్షి’ పిలుపునందుకొని వినాయక చవితి సందర్భంగా పలువురు మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. పర్యావరణ హితమే ధ్యేయంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండి మట్టి వినాయకులను ఇళ్లలో ప్రతిష్టించి పూజలు చేశారు.ఆ ప్రతిమలతో ఫొటోలు దిగి ‘సెల్ఫీ విత్ గణేశ’కు పంపారు.



శ్రావ్య, సాయి, నెల్లూరు



నందు, వరుణ్, రిషిత, నెల్లూరు



సోమయాజుల సుమాంజలి, గూడూరు



వెంకటేశ్వర్లు, బారకాస్, నెల్లూరు



మస్తాన్, నరుకూరు



మనశ్విని, మారుతీచరణ్, వెంకటేశ్వరపురం



రాకేష్, ఆత్మకూరు



దినేష్, నెల్లూరు